


APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త






సంపుటి : 01 సంచిక :93 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శనివారం - 10 - అక్టోబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు.. ఇది మా విధానం

## స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ల అమలుపై కీలక ప్రకటన

- ★ చట్టపరంగా వీలుకాకపోయినా పార్టీపరంగా సీట్లు కేటాయిస్తాం
- ★ వైసీపీ వల్లే బీసీలు రిజర్వేషన్లు కోల్పోయారని టీడీపీ ఆరోపణ
- ★ గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీల కోసం అమలు చేస్తున్న పథకాల వెల్లడి
- ★ బీసీల రాజకీయ ఎదుగుదలకు ఎప్పుడూ అండగా ఉంటామని స్పష్టీకరణ
- ★ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టీడీపీ ప్రకటన




అమరావతి: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తెలుగుదేశం పార్టీ తన విధానాన్ని స్పష్టం చేసింది. చట్టపరమైన ఆమోదం లభించకపోయినా, పార్టీ తరపున బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించి వారి రాజకీయ గౌరవాన్ని కాపాడతామని కీలక ప్రకటన చేసింది. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు జీవో 105, 1065 ద్వారా 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం మిగతా 2 లో




## తన పార్టీలోకి సహచరుడిని ఆహ్వానించిన విజయసాయిరెడ్డి

- ●కొత్త పార్టీ ఏర్పాటుకు ముందు తిరుమల శ్రీవారి దర్శనం
- ●తనతో కలిసి రావాలని ఓవి రమణకు బహిరంగ ఆహ్వానం
- ●గతంలో టీటీడీ బోర్డులో కలిసి పనిచేశామని వెల్లడి

అమరావతి: మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి తన నూతన రాజకీయ పార్టీ ఏర్పాటు పనులను వేగవంతం చేశారు. త్వరలో ప్రారంభించనున్న పార్టీలోకి తన మిత్రుడు, టీటీడీ మాజీ సభ్యుడు ఓవి రమణను బహిరంగంగా ఆహ్వానించారు.

### రూ. 20 లక్షల కోట్ల

## పెట్టుబడులే లక్ష్యం

పారిశ్రామికవేత్తల్లో భరోసా నింపుతున్నామన్న నాదెండ్ల




- ▶ పారిశ్రామిక ప్రగతితో యువతకు భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ
- ▶ వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు కూడా దక్కవని వ్యాఖ్య

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు రూ. 20 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ, యువతకు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే

## విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- ▶▶ అక్టోబర్ 16న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం




## ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?: కిషన్ రెడ్డి

- ●ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి
- ●రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ




## నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు.. యోగి సర్కారు కీలక నిర్ణయం!

పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం

మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం

మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి

విమానాశ్రయం తొలి దశను మార్చిలో ప్రారంభించిన ప్రధాని మోదీ

# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై చంద్రబాబు స్పందన

## స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లపై ఏపీ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత

- ▶▶ 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటరాదన్న హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- ▶▶ కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా బీసీలకు అండగా ఉంటామన్న చంద్రబాబు



అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న

## ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది

### తమిళనాడులో సీఎం విజయ్‌కు బూస్ట్..

: హరీశ్ రావు

- ▶▶ అధికారంలో ఉన్నవారికి ఈసీ రక్షణ కవచం కాదన్న హరీశ్
- ▶▶ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ▶▶ అన్నిటికన్నా ప్రజాస్వామ్యం గొప్పదని వ్యాఖ్య



హైదరాబాద్: భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మిగతా 2 లో




## జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన.. నెలలోగా దరఖాస్తులు క్లియర్

- ▶ జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెలలోగా పరిష్కారం
- ▶ సీఎం రేవంత్ రెడ్డి హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయమని వెల్లడి
- ▶ దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు జారీ చేశామన్న మంత్రి

# రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వర్షాభావ పరిస్థితులపై సమావేశం

## 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి

- ➤ 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం
- ➤ వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి
- ➤ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు



హైదరాబాద్: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా, దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ముఖ్యమంత్రి గారు నిర్వహించే సమావేశంలో చర్చించే అవకాశముంది.

## 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి.. సీఈసీ రాజీనామా చేయాలి: కేటీఆర్




- ▶▶ సర్ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయన్న కేటీఆర్
- ▶▶ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించారని ఆరోపణ
- ▶▶ సీఈసీకి వ్యతిరేకంగా నేడు హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి,

## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై చంద్రబాబు స్పందన

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదంటూ గతంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం కోటా 50 శాతం మించకూడదన్న నిబంధనను హైకోర్టు గుర్తుచేయడం సమంజసమేనని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. న్యాయస్థానాల తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, తమ కూటమి ప్రభుత్వం బీసీలకు పూర్తిస్థాయిలో రాజకీయంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు పార్టీ తరఫున అధిక శాతం సీట్లు కేటాయించి, వారి రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కడాన్ని వైసీపీ సహించలేకపోయిందని చంద్రబాబు ఆరోపించారు. అందుకే కోర్టులకు వెళ్లి, బీసీల రాజకీయ వాటాను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల కోటాను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలు సుమారు 16,800 పదవులు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.

## తన పార్టీలోకి సహచరుడిని ఆహ్వానించిన విజయసాయిరెడ్డి

అమరావతి: మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి తన నూతన రాజకీయ పార్టీ ఏర్పాటు పనులను వేగవంతం చేశారు. త్వరలో ప్రారంభించనున్న పార్టీలోకి తన మిత్రుడు, టీటీడీ మాజీ సభ్యుడు ఓవి రమణను బహిరంగంగా ఆహ్వానించారు. ఈ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. కొత్త పార్టీ ప్రారంభించబోతున్న సందర్భంగా స్వామివారి ఆశీస్సులు తీసుకున్నట్లు విజయసాయి రెడ్డి తెలిపారు. గతంలో తాను, ఓవి రమణ నాలుగేళ్ల పాటు టీటీడీ బోర్డు సభ్యులుగా కలిసి పనిచేశామని గుర్తుచేశారు. ఇప్పుడు తన కొత్త పార్టీలోనూ ఇద్దరం కలిసి పనిచేసి విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు అసలైన అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, తిరుమలలో వెయ్యి కాళ్ల మండపాన్ని పునర్నిర్మించాలని విజయసాయి రెడ్డి విజ్ఞప్తి చేశారు. జీయర్ స్వామి, ఇతర పీఠాధిపతుల ఆకాంక్ష మేరకు ఈ నిర్మాణం జరగాలని కోరారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ శక్తిని ఏర్పాటు చేసేందుకు విజయసాయి రెడ్డి ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఆయన కీలక నేతలను సంప్రదిస్తూ పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు.

## ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది: హరీశ్ రావు

హైదరాబాద్: భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

## 'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి..
## సీఈసీ రాజీనామా చేయాలి: కేటీఆర్

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ూ×= ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు. మరోవైపు, రేపు హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులో ఢిల్లీకి కూడా విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

## పాక్ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్' అన్న భారత్..
## అసలు దాని అర్థం ఏంటి?

ఢిల్లీ: పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ తీవ్ర విమర్శలు చేసింది. ఆ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్'గా అభివర్ణించింది. ఉగ్రవాదాన్ని అరికట్టడంపై దృష్టి పెట్టకుండా తప్పుడు ప్రచారానికి పాకిస్థాన్ ప్రాధాన్యం ఇస్తోందని భారత దౌత్యవేత్త రఘు పూరి ఆరోపించారు. గతంలో పాకిస్థాన్ పెంచి పోషించిన ఉగ్రవాద సంస్థలే ఇప్పుడు ఆ దేశానికి సమస్యగా మారాయని వ్యాఖ్యానించారు. అయితే, ఈ విమర్శ వెనుక ఉన్న 'ఫామ్ 47' వివాదం ఏంటి?. 2024లో పాకిస్థాన్‌లో జరిగిన ఎన్నికల నుంచి ఈ పదం ఎక్కువగా వినిపిస్తోంది. ఆ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన 'పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్' (పీటీఐ) పార్టీ ఆరోపించింది. ఎన్నికల ఫలితాలను మార్చి షరీఫ్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించింది. ఈ ఆరోపణలు పాక్ ప్రభుత్వం ఎలా ఏర్పాటైందనే అంశం వైపు, ఎన్నికల ఫలితాల లెక్కల్లో తేడాలున్నాయన్న అప్పటి వివాదంలో ప్రధాన అంశం. పాకిస్థాన్ ఎన్నికల్లో 'ఫామ్ 45' అనేది ప్రతి పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల వివరాలను చూపించే పత్రం. ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయన్న సమాచారం ఇందులో ఉంటుంది. 'ఫామ్ 47' మాత్రం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల ఫలితాలను కలిపి రూపొందించే తాత్కాలిక సమగ్ర ఫలితాల పత్రం. అంటే 'ఫామ్ 45' పోలింగ్ కేంద్రం స్థాయిలో, 'ఫామ్ 47' నియోజకవర్గం స్థాయిలో ఫలితాలను చూపిస్తాయి. 2024 ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో 'ఫామ్ 45'లో ఉన్న ఓట్ల వివరాలు, 'ఫామ్ 47'లో నమోదైన లెక్కలతో సరిపోలలేదని పీటీఐ ఆరోపించింది. తమ మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల లెక్కల ప్రకారం గెలిచినా, తుది ఫలితాల్లో ఓడిపోయినట్లు చూపించారని పేర్కొంది. ఆ ఎన్నికల్లో ఇమ్రాన్ ఖాన్ పార్టీ మద్దతున్న స్వతంత్ర అభ్యర్థులు అత్యధికంగా 101 స్థానాలు గెలుచుకున్నారు. అయినప్పటికీ పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) ఇతర పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కామన్వెల్త్ ఎన్నికల పరిశీలకుల నివేదికలోనూ కొన్ని 'ఫామ్ 47' పత్రాల్లో మార్పులు జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు. దీంతో షరీఫ్ ప్రభుత్వాన్ని విమర్శించేందుకు పీటీఐ 'ఫామ్ 47 సర్కార్' అనే పదాన్ని వాడుతోంది. ఎన్నికల్లో అక్రమాల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వమని ఆరోపించడమే ఈ పదం వెనుక ఉద్దేశం. ఐరాస వేదికగా భారత్ ఈ పదాన్ని ప్రస్తావించడంతో పాకిస్థాన్ ఎన్నికల విశ్వసనీయతపై ఉన్న వివాదం మరోసారి అంతర్జాతీయ చర్చకు వచ్చింది.

## ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజించారు: రేవంత్ రెడ్డి



హైదరాబాద్: ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజూ పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి భయంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు.. ఇది మా విధానం: టీడీపీ

అమరావతి: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో తెలుగుదేశం పార్టీ తన విధానాన్ని స్పష్టం చేసింది. చట్టపరమైన ఆమోదం లభించకపోయినా, పార్టీ తరఫున బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించి వారి రాజకీయ గౌరవాన్ని కాపాడతామని కీలక ప్రకటన చేసింది. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు జీవో 105, 1065 ద్వారా 34 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం చేశామని, అయితే వైసీపీ నేతలు కోర్టులకు వెళ్లడం వల్లే హైకోర్టు ఆ జీవోలను కొట్టివేసిందని టీడీపీ ఆరోపించింది. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టును ఆశ్రయించామని, సీనియర్ న్యాయవాదులను నియమించి పోరాడినా దురదృష్టవశాత్తు అనుకూల తీర్పు రాలేదని తెలుగుదేశం పార్టీ గుర్తుచేసింది. అయినా సరే, బీసీల విషయంలో తమ నిబద్ధతను చాటుకుంటామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీపరంగా 34 శాతానికి తగ్గకుండా బీసీ వర్గాలకు సీట్లు కేటాయిస్తామని ఉద్ఘాటించింది. బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారికి న్యాయం చేయడమే తమ లక్ష్యమని, కానీ వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరి అని విమర్శించింది.

కుట్రలు చేసి, కోర్టులకు వెళ్లి రిజర్వేషన్లు పోయేలా చేసి, మళ్లీ తమపైనే ఆరోపణలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టింది. నాడు హైకోర్టు రిజర్వేషన్లు కొట్టివేసినప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ, బీసీలకు న్యాయం చేసేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదని ఆక్షేపించింది.

బీసీలకు అండగా నిలిచింది టీడీపీనే

బీసీలకు రాజ్యాధికారం అనే మాటను తొలిసారిగా పలికి, వారికి అవకాశాలు కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని ఈ సందర్భంగా టీడీపీ గుర్తుచేసింది. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ కారణంగా నాలుగు దశాబ్దాల క్రితమే బీసీల గళం వినిపించిందని, ఆ తర్వాత తాము ఆ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లామని తెలిపింది. 1995లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచిన ఘనత తమదేనని పేర్కొంది. బీసీలు తమకు అండగా ఉన్నారనే అక్కసుతోనే గత వైసీపీ ప్రభుత్వం వారిని అణగదొక్కే ప్రయత్నం చేసిందని, 30 ఏళ్లుగా అమలవుతున్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని ఆరోపించింది. దీనివల్ల సుమారు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేసింది.

### గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో బీసీలకు మేలు

బీసీ ఫెడరేషన్లకు నాంది పలికింది కూడా తమ ప్రభుత్వమేనని టీడీపీ తెలిపింది. కులవృత్తులు, చేతివృత్తులను పరిరక్షించేందుకు, వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు 'ఆదరణ' వంటి పథకాలను తీసుకువచ్చామని, ఈ పథకం కింద 341 రకాల పనిముట్లను 90 శాతం సబ్సిడీతో అందించామని గుర్తుచేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించింది. ఇందులో భాగంగా వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు, గీత కార్మికులకు 10 శాతం ఎక్సైజ్ షాపులు కేటాయించామని తెలిపింది. 'నేతన్న సేవ' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని, చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని తామే ప్రారంభించామని, ఇప్పుడు 'మత్స్యకార సేవ' పథకం కింద ఆ సహాయాన్ని రూ.20,000కు పెంచామని వివరించింది. సబ్సిడీపై బోట్లు, డీజిల్ అందిస్తూ, తీరప్రాంతంలో వారి హక్కులకు రక్షణ కల్పిస్తున్నామని తెలిపింది. గత ప్రభుత్వం అన్యాయంగా తెచ్చిన జీవో నెంబర్ 217ను రద్దు చేసి మత్స్యకార సొసైటీల హక్కులను కాపాడామని, మత్స్యకార మహిళలకు సీ వీడ్ పెంపకంపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని చెప్పింది. నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, దేవాలయాల్లో పనిచేసే వారికి భృతిని రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచామని తెలిపింది. స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని పేర్కొంది. చట్టపరంగా ఏది ఏమైనప్పటికీ, రాజకీయంగా బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకుంటామని టీడీపీ పునరుద్ఘాటించింది.

## నందిగ్రామ్‌లో బీజేపీ రికార్డు విజయం..
## 1.22 లక్షల ఓట్ల భారీ మెజారిటీ!

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీజేపీ చరిత్ర సృష్టించింది. ఆ పార్టీ అభ్యర్థి హసిరాణి రథ్ ఏకంగా 1,22,753 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. 1967 నుంచి నందిగ్రామ్‌లో గెలిచిన అభ్యర్థుల మెజారిటీల్లో ఇదే అత్యధికం. ఈ ఫలితంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. హసిరాణి రథ్‌కు 1,64,427 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. సీపీఐ అభ్యర్థి శాంతి గోపాల్ గిరికి 5,779 ఓట్లు వచ్చాయి. ఆలిండియా సెక్యులర్ ఫ్రంట్ అభ్యర్థి అలీ మహమ్మద్ సబీర్ మీరాజ్ ఖాన్ 1,607 ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్‌కు కేవలం 853 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పోటీకి దూరంగా ఉంది. ఆ పార్టీ అభ్యర్థి సంచిత ప్రధాన్ డే చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు మమతా బెనర్జీ ప్రకటించారు. అయినప్పటికీ బీజేపీకి కాంగ్రెస్ గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. నందిగ్రామ్‌లో గతంలో అత్యధిక మెజారిటీ రికార్డు ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి పేరిట ఉండేది. 2016లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన 81,230 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారి బీజేపీ అభ్యర్థి అంతకంటే ఎక్కువ మెజారిటీ సాధిస్తారని తాను ముందే అంచనా వేసినట్లు సువేందు అధికారి తెలిపారు. మైనారిటీ ఓట్లలోనూ బీజేపీ అభ్యర్థికి మద్దతు లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి సువేందు అధికారి కేవలం 9,665 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అయితే, భవానీపూర్ స్థానం నుంచి కూడా గెలిచిన ఆయన నందిగ్రామ్‌ను వదులుకోవడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. హసిరాణి రథ్.. సువేందు అధికారి మాజీ వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ తల్లి. చంద్రనాథ్ ఈ ఏడాది మే 6న మాధ్యమ్‌గ్రామ్‌లో హత్యకు గురయ్యారు.

## విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబర్ 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. రాష్ట్రపతితో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రద్దీని బట్టి సాయంత్రం వేళ కూడా వీఐపీ దర్శనాలకు మరో స్లాట్ కేటాయించే అవకాశం ఉందని వివరించారు. భక్తుల కోసం భారీ క్యూ కాంప్లెక్స్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.

## తమిళనాడులో సీఎం విజయ్‌కు బూస్ట్..
## రెండు ఉప ఎన్నికల్లోనూ టీవీకే ఘన విజయం!

తమిళనాడు : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఉప ఎన్నికల్లో భారీ విజయం దక్కింది. మధురాంతకం, ధారాపురం అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. రెండు స్థానాల్లోనూ ప్రధాన ప్రత్యర్థి డీఎంకే రెండో స్థానానికే పరిమితమైంది. ఈ ఫలితాలు విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత బలాన్ని ఇచ్చాయి. మధురాంతకం నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆమెకు 61,470 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌కు 43,916 ఓట్లు వచ్చాయి. అన్నాడీఎంకే అభ్యర్థి గణిత సంపత్ 38,770 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 27 మంది పోటీ చేయగా, 86.26 శాతం పోలింగ్ నమోదైంది. ధారాపురంలోనూ టీవీకే అభ్యర్థి సత్యభామ విజయకేతనం ఎగురవేశారు. ఆమెకు 62,596 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి సుకన్యకు 52,400 ఓట్లు వచ్చాయి. దీంతో సత్యభామ 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అన్నాడీఎంకే అభ్యర్థి భానుమతి 41,078 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇక్కడ 22 మంది అభ్యర్థులు పోటీ చేయగా, 80.30 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. గతంలో అన్నాడీఎంకే తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. దీంతో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. టీవీకే, డీఎంకే, అన్నాడీఎంకేతో పాటు వామపక్షాలు, నామ్ తమిళర్ కట్చి కూడా పోటీలో నిలిచాయి. ఈ విజయాలు తమ ప్రభుత్వం గత నాలుగు నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతలు అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో హోరాహోరీ పోటీ నెలకొన్న నేపథ్యంలో రెండు స్థానాలనూ గెలుచుకోవడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు, రెండు చోట్లా ఓటమి పాలైన డీఎంకే, అన్నాడీఎంకే తమ ఫలితాలను సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఉప ఎన్నికలు రెండు స్థానాలకే పరిమితమైనా, విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి.

## జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన..
## నెలలోగా దరఖాస్తులు క్లియర్

హైదరాబాద్: తెలంగాణలో జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 22-ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో ఇది మరో కీలక ముందడుగు అని అన్నారు. ఈ మేరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసిందని మంత్రి వివరించారు. "జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయి" అని ఆయన హామీ ఇచ్చారు. గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని పొంగులేటి వెల్లడించారు. సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఏ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని... 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొంది 22-ఏ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు కూడా అనుమతి ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.

## ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?: కిషన్ రెడ్డి

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

## నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు..
## యోగి సర్కారు కీలక నిర్ణయం!

ఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

## అమరావతిలో చెస్ అకాడమీ..
## కోనేరు హంపికి మంత్రి లోకేశ్ హామీ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి చెస్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఈ మేరకు ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చేసిన విజ్ఞప్తి పట్ల రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. అకాడమీ స్థాపనకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి లోకేశ్‌తో కోనేరు హంపి, ఆమె తండ్రి అశోక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన హంపిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నీలో భారత మహిళల జట్టు కాంస్య పతకం సాధించడంలోనూ, వ్యక్తిగత విభాగంలో బోర్డు-1పై కాంస్యం గెలవడంలోనూ హంపి పోషించిన కీలక పాత్రను ఆయన ప్రశంసించారు. భవిష్యత్ తరం క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో అమరావతిలో ఒక ప్రత్యేక చెస్ అకాడమీని ఏర్పాటు చేయాలన్న తన ఆకాంక్షను హంపి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ బృహత్కార్యానికి ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అకాడమీ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో చదరంగ క్రీడకు మరింత ప్రోత్సాహం లభించనుంది.

## భారత పైలట్ స్మిత్ మచ్చర్‌కు
## ఇజ్రాయెల్ అత్యున్నత పౌర సాహస పురస్కారం

ఢిల్లీ: భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ విమానంలో సహ పైలట్ దాడి చేసినా వెనక్కి తగ్గలేదు.. తీవ్రంగా గాయపడినా ధైర్యంగా పోరాడి 174 మంది ప్రాణాలను కాపాడారు. ఆయన సాహసానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం అరుదైన గౌరవం ప్రకటించింది. దేశ అత్యున్నత పౌర సాహస పురస్కారాన్ని అందించనున్నట్లు అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ వెల్లడించారు. మచ్చర్ కోలుకున్న తర్వాత స్వయంగా పురస్కారాన్ని అందజేస్తానని తెలిపారు. గతవారం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. యూఏఈ దర్యాప్తు వివరాల ప్రకారం.. విమాన సహ పైలట్ హమామ్ అల్ హమామీ కాక్‌పిట్‌లోని గొడ్డలితో మచ్చర్‌పై దాడి చేశాడు. అనంతరం విమాన నియంత్రణను తన చేతుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనను ఉగ్రదాడిగా యూఏఈ అధికారులు అభివర్ణించారు. తనపై దాడి జరిగినా మచ్చర్ ప్రతిఘటించారు. గాయాలతోనే కాక్‌పిట్ తలుపు తెరిచారు. దీంతో లోపలికి వచ్చిన ప్రయాణికులు దాడి చేసిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి సాహసంతో విమానం ప్రమాదానికి గురికాకుండా నిలువరించగలిగారు. ఈ ఘటనలో ధైర్యంగా వ్యవహరించిన ఆరుగురు ఇజ్రాయెల్ పౌరులకు సైతం హెర్జోగ్ పౌర సాహస పురస్కారాలను అందించారు. తాలి మేనెస్, జ్వికా మేనెస్, యానివ్ హయూన్, డాక్టర్ షోటా ముసాయేవ్, అసఫ్ రజువాన్, ఓర్ పార్దిలోవ్‌లను జెరూసలేంలోని అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ఇదిలా ఉండగా.. విమానంలో జరిగిన భయానక ఘటనను మచ్చర్ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో పంచుకున్నారు. ఇజ్రాయెల్ తదుపరి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి వేడుక జ్యోతిని వెలిగించాల్సిందిగా మచ్చర్‌ను నెతన్యాహు ఆహ్వానించారు.

## రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై సమావేశం

హైదరాబాద్: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా, దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ముఖ్యమంత్రి గారు నిర్వహించే సమావేశంలో చర్చించే అవకాశముంది.

## రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం: నాదెండ్ల మనోహర్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు రూ. 20 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ, యువతకు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఆయన స్పష్టం చేశారు. పారదర్శక విధానాలు, పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణం సృష్టించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మనోహర్ వివరించారు. గత వైసీపీ పాలనలో నెలకొన్న అనిశ్చితిని తొలగించి, పారిశ్రామిక వర్గాల్లో మళ్లీ భరోసా నింపడంలో తమ ప్రభుత్వం విజయం సాధించిందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం వైసీపీ బెదిరింపు రాజకీయాలకు పాల్పడిందని మనోహర్ ఆరోపించారు. దీనివల్ల ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిని, ప్రజలు స్వేచ్ఛను కోల్పోయారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో భయరహిత వాతావరణాన్ని నెలకొల్పిందని, శాంతిభద్రతలు, పౌర హక్కులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ రాజకీయ భవిష్యత్తుపై జోస్యం చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న 11 అసెంబ్లీ స్థానాలు కూడా దక్కవని, వైసీపీ పతనం అనివార్యమని అన్నారు. ప్రజలు ఇప్పటికే గత పాలనను తిరస్కరించారని, సంక్షేమం, అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం చూపుతున్న చొరవపై బలమైన విశ్వాసంతో ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సీనియర్ పాత్రికేయులు ఎస్.ఎస్.ఆర్.ఆంజనేయులు

ఆధ్యాత్మికత, జర్నలిజం సమాజానికి మార్గదర్శకాలు...సీనియర్ సాఫ్ట్ వేర్ ఉద్యోగి మదన నవీన్ రెడ్డి





విజయవాడ, శ్రీ వార్త న్యూస్:ఆధ్యాత్మిక చింతన, నిష్పాక్షిక పాత్రికేయం సమాజానికి సరైన దిశా నిర్దేశం చేస్తాయని ఆధ్యాత్మిక వేత్త, సీనియర్ పాత్రికేయులు ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు పేర్కొన్నారు.నగరంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,సమాజంలో విలువలను పెంపొందించడంలో ఆధ్యాత్మికత పాత్ర కీలకమన్నారు.

## నవీన్ రెడ్డి ప్రసంగం హైలైట్:

ఈ సందర్భంగా సీనియర్ సాఫ్ట్ వేర్ ఉద్యోగి మదన నవీన్ రెడ్డి మాట్లాడుతూ..."సీనియర్ పాత్రికేయులు ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయం. జర్నలిజంలో దశాబ్దాల అనుభవంతో పాటు ఆధ్యాత్మిక రంగంలో ఆయన చేస్తున్న కృషి నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం.సాఫ్ట్ వేర్ రంగంలో ఒత్తిడితో కూడిన జీవితం గడుపుతున్న మాలాంటి వారికి ఆధ్యాత్మికత ఎంతో ప్రశాంతతను ఇస్తుంది. ఆంజనేయులు అంతే కాకుండా ఆయన దంపతులు జానికి రాముడు లాంటివారు. ఆధ్యాత్మిక విశ్లేషణలు మాకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. జర్నలిజం విలువలను కాపాడుతూనే ఆధ్యాత్మిక భావాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న తీరు గొప్పది.వృత్తిపరమైన విజయంతో పాటు వ్యక్తిగతంగా సమాజసేవ ఆత్మశాంతికి ఆధ్యాత్మికత ఎంతో అవసరమని ఆయన ద్వారా తెలుసుకున్నాను" అని నవీన్ రెడ్డి కొనియాడారు.ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు, పలు ప్రత్యేక అవార్డుల గ్రహీత అన్నవరపు బ్రహ్మయ్య, కానుక దినపత్రిక ఎడిటర్ సత్తిరాజు మల్లికార్జునరావు, శ్రీ వార్త ఎడిటర్ కూరేటి సతీష్, సన్ న్యూస్ విజయవాడ బ్యూరో పాములపర్తి ప్రభాకరరావు, సీనియర్ పాత్రికేయులు మామిళ్లపల్లి శివాచార్య ఫణి కుమార్ శర్మ, విజయవాడ బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ అధికారి శంకర మల్లికార్జున శర్మ, హైదరాబాద్ "అర్చక రత్న" శ్రీధరమల్లె గౌతమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు."

# మచిలీపట్నం పరిసర ప్రాంత డాగురె ఫోటో ఇండస్ట్రీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిష్కరణ



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్ల యొక్క పాత్ర ఎంతో కీలకమైందని విలువైన ఓటు విధానానికి తమ వంతు పాత్ర నిష్పక్షపాతంగా పోషించాలని రాష్ట్ర ఫోటోగ్రాఫర్స్ మరియు వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజీ అన్నారు. శనివారం "మచిలీపట్నం పరిసర ప్రాంత డాగురె ఫోటో ఇండస్ట్రీ వెల్ఫేర్ అసోసియేషన్" సొసైటీని రిజిస్ట్రేషన్ చేసిన సందర్భంగా లోగో ఆవిష్కరణ కార్యక్రమం లంకిశెట్టి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ యూనియన్ లో నమోదు కాబడిన ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు ను ప్రభుత్వపరంగా పోలింగ్ కేంద్రాల్లో నియమిస్తారని ప్రతి ఒక్కరూ ఎంతో బాధ్యతాయుతంగా తమ వంతు పాత్ర పోషించాలని అన్నారు. జిల్లా ముఖ్య కేంద్రంలో ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్ల కోసం ఫోటో భవన్ నిర్మాణం కొరకు ఐదు సెంట్లు స్థలం కేటాయించాలని బాలాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నేటి యువతరానికి చెందిన ఫోటోగ్రాఫర్లకు స్కిల్ సెంటర్ ద్వారా తగిన శిక్షణ ఇవ్వాలని వృద్ధులైన ఫోటోగ్రాఫర్లకు పెన్షన్స్ సదుపాయం ఇళ్లస్థలాలు ఇవ్వాలని బాలాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్ల సంక్షేమం కోసం తమ సంఘం నిరంతరం పనిచేస్తుందని సంఘ అధ్యక్షులు గురిజాల సుధీర్ కార్యదర్శి వంక అనంత కుమార్ కోశాధికారి బైత సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రవి, రాకేష్, తేజ, హరి, కళ్యాణ్, చిన్న, శేషుబాబు తదితరులు పాల్గొని లంకిశెట్టిని సన్మానించారు

# స్వచ్ఛ రథాలకు 'వేరు చేసిన' చెత్తనే అందించాలి:....డివిజన్ అధికారిణి తుంగల స్వర్ణలత




పామర్రు శ్రీవార్త న్యూస్:గ్రామ పంచాయతీల పరిధిలో తిరిగే స్వచ్ఛ రథం వాహనాలకు ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తను విడివిడిగా వేరు చేసి మాత్రమే అందించాలని డివిజన్ పంచాయతీ అధికారి ణి తుంగల స్వర్ణలత పిలుపునిచ్చారు . శుక్రవారం పామర్రు చెత్త సంపద కేంద్రంలో పారిశుధ్య సిబ్బందికి, కార్యదర్శులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇళ్లల్లో చెత్తను క్రమబద్ధీకరించడానికి బిన్ బ్యాగులను బిన్ బ్యాగ్స్ ఎలా ఉపయోగించాలో, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. తడి చెత్తను వర్మి కంపోస్ట్‌గా మార్చడానికి, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయడానికి ఈ వర్గీకరణ ఎంతో అవసరమన్నారు. ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను స్వచ్ఛ రథాలకు ఇచ్చి అవసరమైన వస్తువులు పొందేలా ప్రజలను ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పామర్రు డిప్యూటీ ఎంపీడీవో పంచాయతీ విస్తరణ అధికారి నందమూరి స్నేహలత, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ కార్యదర్శులు క్లాప్ మిత్రాలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గా మండపాలకు ఉచిత విద్యుత్ - 11 నుంచి 20వ తేదీ వరకు సరఫరా...పి.పుల్లారెడ్డి



విజయవాడ శ్రీ వార్త న్యూస్:విజయదశమి పండుగ సందర్భంగా దుర్గామాత మండపాలకు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు.ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్లు, పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు వెల్లడించారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.అనుమతి పొందిన దుర్గా మండపాల నిర్వాహకులు నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని, నిర్దేశించిన పరిమితికి మించి లోడ్ అవసరమైతే సాధారణ తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు.విద్యుత్ భద్రతా నిబంధనలు తప్పనిసరి:మండపాల వద్ద విద్యుత్ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా మండపాలను ఏర్పాటు చేయాలని, మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎండీ సూచించారు. నాణ్యమైన వైర్లు, స్విచ్ లు, ప్లగ్ లు మాత్రమే వినియోగించాలని, ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా తాకవద్దని, వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్ కు లేదా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# 25 ఏళ్ల మోదీ పాలన.. హామీలకు గ్యారంటీ, అమలుకు వారంటీ లేదా? ప్రతి ఎన్నికకు కొత్త జుమ్లా.. ప్రతి హామీకి కొత్త గడువు!

మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితంపై ప్రశ్నల వర్షం కురిపించిన భార్గవ్ వల్లూరు



విజయవాడ శ్రీ వార్త న్యూస్:ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితంలో ఇచ్చిన హామీలకు, వాటి అమలుకు మధ్య ఉన్న వ్యత్యాసంపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని విజయవాడ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి భార్గవ్ వల్లూరు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఆకర్షణీయమైన హామీలు ఇవ్వడం, వాటి అమలుపై ప్రశ్నలు ఎదురైనప్పుడు కొత్త గడువులు చెప్పడం బీజేపీ రాజకీయాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు.ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, విదేశాల నుంచి నల్లధనం వెనక్కి తీసుకురావడం, 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు, 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, అందరికీ పక్కా ఇళ్లు, 100 స్మార్ట్ సిటీలు, బుల్లెట్ రైలు వంటి హామీలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర లెక్కలు వెల్లడించాలని భార్గవ్ వల్లూరు డిమాండ్ చేశారు."నల్లధనం వెనక్కి తెస్తామన్నారు.. యువతకు కోట్లాది ఉద్యోగాలిస్తామన్నారు.. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు.. సామాన్యులకు అచ్చే దిన్ తీసుకొస్తామన్నారు. మరి ఈ హామీల అమలుపై ప్రజలకు పూర్తి వివరాలు ఎప్పుడు చెబుతారు?" అని ఆయన ప్రశ్నించారు.నోట్ల రద్దుతో నల్లధనం, నకిలీ కరెన్సీ, ఉగ్రవాదానికి నిధుల సరఫరాను అరికడతామని చెప్పిన ప్రభుత్వం, ఆ చర్యల ఫలితాలపై కూడా ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని అన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాలు, ఉపాధిపై ఆందోళనలు, రైతుల సమస్యల నేపథ్యంలో కేవలం ప్రచార ప్రకటనలు ప్రజలకు ఉపశమనం కలిగించలేవని పేర్కొన్నారు.రైతులకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర, కశ్మీరీ పండిట్ల పునరావాసం, జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ వంటి అంశాలపైనా కేంద్రం తన హామీల అమలు స్థితిని స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు."25 ఏళ్ల రాజకీయ అనుభవం అంటే 25 ఏళ్ల హామీల జాబితా కాదు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, సాధించిన ఫలితాలకు లెక్క చెప్పడం, విఫలమైన హామీలపై బాధ్యత వహించడం నిజమైన నాయకత్వ లక్షణాలు. ప్రతి ఎన్నికకు కొత్త జుమ్లా.. ప్రతి హామీకి కొత్త గడువు అనే రాజకీయ ధోరణికి ప్రజాస్వామ్యంలో సమాధానం చెప్పాల్సిందే" అని భార్గవ్ వల్లూరు స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున ఉద్యోగాలు, రైతుల హక్కులు, ధరల నియంత్రణ, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని ఆయన తెలిపారు.ప్రజలకు కావాల్సింది మరో హామీ కాదు.. ఇచ్చిన హామీలపై లెక్క! ప్రచారం కాదు.. జవాబుదారీతనం కావాలి!

# ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన, వల్లభనేని వంశీ



గన్నవరం శ్రీ వార్త న్యూస్:తన ఆత్మీయ మిత్రుడు, ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు వి.వి. వినాయక్ జన్మదినం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మాట్లాడుతూ.వి.వి. వినాయక్ తో తనకున్న స్నేహ బంధం ఎంతో ప్రత్యేకమైనదన్నారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన శైలితో ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలను అందించి మాస్ డైరెక్టర్ గా చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు.వినాయక్ దర్శకత్వం వహించిన చిత్రాలు తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని, భవిష్యత్తులో మరెన్నో విజయవంతమైన చిత్రాలు అందించి మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# రాజ్యలక్ష్మి అమ్మవారు అమ్మవారు గీతా మందిరంలో 11 నుండి శరన్నవరాత్రి ఉత్సవాలు



అవనిగడ్డ అక్టోబర్ 9 శ్రీ వార్త గీతా మందిరంలో ఈనెల 11 నుండి 20వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గీత మందిర కమిటీ శుక్రవారం తెలిపింది. ప్రతిరోజు ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు సహస్రనామాలతో కుంకుమ అర్చనలు సువర్ణ పుష్పాలతో విశేష అర్చనలు జరుగుతాయని చెప్పారు. ప్రతిరోజు విశేష అలంకారాలలో అమ్మవారు దర్శనమిస్తారని 20వ తేదీన విజయదశమిని పురస్కరించుకొని సెమీ పూజ జరుగుతుందని నిజరూప అలంకారాలలో అమ్మవారు దర్శనమిస్తారని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కావున ఈ ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు,

# విద్యార్థులను అభినందిస్తున్న సీసీ. ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు రాష్ట్రస్థాయి పోటీలకు ఎస్ వి ఎల్ విద్యార్థులు ఎంపిక



అవనిగడ్డ అక్టోబర్ 9 శ్రీ వార్త నూజివీడు లో జరుగుతున్న సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎస్ వి ఎల్ క్రాంతి విద్యార్థులు పాల్గొని ఎంపికయ్యారు. ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు జరుగుతున్న సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు డి. గౌరీ, డి నాంచారయ్య, ఏ ప్రశాంత్, లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎస్విఎల్ విద్యాసంస్థల డైరెక్టర్ డి ఉమామహేశ్వరరావు. ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు లు అభినందించారు. వీరితోపాటు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితోపాటు పలువురు అభినందనలు తెలిపారు,

# అన్న ప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు 4 అన్నాభిషేకంలో స్వామివారు 3000 మంది భక్తులకు అన్నసంతర్పణ



అవనిగడ్డ అక్టోబర్ 9 శ్రీ వార్త రాజరాజేశ్వరి సహిత రాజశేఖర్ స్వామి వారి దేవస్థానంలో 3000 మంది భక్తులకు ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. ప్రతినెల మాస శివరాత్రి పురస్కరించుకొని గత తొమ్మిది సంవత్సరాలుగా ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మాస శివరాత్రి పురస్కరించుకొని శుక్రవారం వేకువ జామునే స్వామివారికి విశేష పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా తొమ్మిది గంటలకు బచ్చు శివకృష్ణ దేవి గాయత్రీ దంపతులు స్వామి వారికి దివ్య శాంతి కళ్యాణం వేద మంత్రోచ్చారణ నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిలను దర్శించుకుని లింగాష్టకం పారాయణం చేసి విష్ణు సహస్రనామ పారాయణం చేసి తీర్థ అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించగా ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు,c

# టోల్గేట్ వద్ద రెడ్ క్రాస్ సభ్యులు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి పెంచి పోషించాలి



అవనిగడ్డ అక్టోబర్ 9 శ్రీ వార్త నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో మోపిదేవి ఎస్ వి ఆర్ నుండి పులిగడ్డ పార్కు వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయం వరకు నేషనల్ హైవే పక్కన ఇరువైపులా శుభ్రం చేసి మొక్కలు నాటి పెంచి పోషించాలని రెడ్ క్రాస్ సభ్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం మోపిదేవి లో గల టోల్గేట్ మేనేజర్ పటాన్ కరిముల్లా ఖాన్ ను కలిసి నేషనల్ హైవే ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో వాతావరణం ఆహ్లాదకరంగా లేదని జెసిబి సహాయంతో జంగిల్ క్లియరెన్స్ చేసి శుభ్రం చేసి మొక్కలు నాటాలని వారికి తెలిపారు. దీనికి సంబంధించి నేషనల్ హైవే అథారిటీ మెయింటెనెన్స్ ఇంచార్జి కొల్లూరి రవి చరవాణి ద్వారా సంప్రదించగా వెంటనే జెసిబి ఏర్పాటు చేస్తానని మాటిచ్చారని ఇందుకు పని చేయటానికి ముందుకు వచ్చిన రెడ్ క్రాస్ సభ్యులను నేషనల్ హైవే అథారిటీ వారు అభినందించారు. అందమైన దివిసీమను తయారు చేయడమే తమ యొక్క ధ్యేయం అని అది నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారని రెడ్ క్రాస్ సభ్యులు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ వారు తలపెట్టిన ఈ మహా యజ్ఞంలో పూల మొక్కలు టీ గార్డ్స్ అందజేయగల దాతలు తమ వంతు సహకారం ధన రూపంలో కాకుండా పూల మొక్కలు నాటి వాటి రక్షణ కొరకు టీ గార్డ్స్ రూపంలో అందజేయాలని రెడ్ క్రాస్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు భోగాది సుబ్రహ్మణ. సామర్ల మల్లికార్జున రావు లతోపాటు పలువురు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు,

# ఎమ్మెల్యేకు లంకమ్మ ప్రసాద్ సత్కారం ధన్యవాదాలు తెలుపుతున్న లంకమ్మ ప్రసాద్



అవనిగడ్డ అక్టోబర్ 9 శ్రీ వార్త ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదుకు అశ్వారావుపాలెం మాజీ సర్పంచ్, జనసేన పార్టీ నాయకులు పంద్రాజు లంకమ్మ ప్రసాద్ శుక్రవారం సత్కరించారు. జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ నియమించిన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కో-ఆర్డినేషన్ మచిలీపట్నం పార్లమెంటు కమిటీలో నిర్వాహక్ దళ్ సభ్యునిగా తనను నియమించిన సందర్భంగా ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా లంకమ్మ ప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మార్గదర్శకత్వంలో నియోజకవర్గ యువనాయకులు, స్థానిక సంస్థల మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మండలి వెంకట్రామ్ నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా సమిష్టి కృషి చేస్తానన్నారు.

# జనసేన సమన్వయకర్తగా మండలి వెంకట్రామ్



అవనిగడ్డ అక్టోబర్ 9 శ్రీ వార్త జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కో-ఆర్డినేషన్ మచిలీపట్టణం పార్లమెంట్ కమిటీ సమన్వయకర్తగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయులు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ నియమితులయ్యారు. తాజాగా జనసేన పార్టీ శుక్రవారం ప్రకటించిన ఈ కమిటీలో ఆయనతో పాటు మచిలీపట్టణం ఎంపీ వల్లభనేని బాలశౌరి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, డాక్టర్ మాధవి ఉన్నారు. ఈ కమిటీలో సేవా దళ్ సభ్యులుగా నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు బండ్రెడ్డి హరి, పంద్రాజు లంకమ్మ ప్రసాద్, సూదాని నందగోపాల్, తోట సోమశేఖర్, లంక సురేష్ ఉన్నారు.

# సాగునీటి సమస్యల పరిష్కారానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఎమ్మెల్యే విజయుడు భేటీ

తుంగభద్ర నదికి ఇండెంట్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

జూరాల ప్రాజెక్టు 99, 100 ప్యాకేజీల పనులు వేగవంతం చేయాలని కోరిన ఎమ్మెల్యే

రైతుల సాగునీటి అవసరాలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే విజయుడు





అలంపూర్ అలంపూర్ నియోజకవర్గంలోని సాగునీటి సమస్యల పరిష్కారం, రైతుల అవసరాలపై ఎమ్మెల్యే విజయుడు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి చర్చించారు. ఈ సందర్భంగా తుంగభద్ర నదికి ఇండెంట్ పెట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. జూరాల ప్రాజెక్టుకు సంబంధించిన 99, 100 ప్యాకేజీల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పనులు వేగవంతమైతే నియోజకవర్గంలోని రైతులకు ప్రయోజనం కలగడంతో పాటు సాగునీటి అవసరాలు తీర్చుకోవడానికి మరింత అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు. అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధి, సాగునీటి సమస్యల పరిష్కారం, రైతులకు మేలు చేకూర్చే అంశాలపై ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తులపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

# భీమదేవరపల్లి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక





హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి మండలం/09 అక్టోబర్ అధ్యక్షుడిగా మాడుగుల రాజ్‌కుమార్.. ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణభీమదేవరపల్లి మండల ప్రెస్ క్లబ్ (రి. నెం. 629/2022) నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని కొత్త కొండలో నిర్వహించిన సమావేశంలో మండలానికి చెందిన 20 మంది విలేకరులతో సీనియర్ విలేకరి, గౌరవ అధ్యక్షుడు మాడుగుల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా మాడుగుల రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా గౌడ చంద్రబాబు, కోశాధికారిగా ఉడుత శ్రీనాథ్, కార్యదర్శిగా కనకం వెంకటేశ్ ఎన్నికయ్యారు. సీనియర్ విలేఖరి చుంచు ఐలయ్య సలహాదారుగా వ్యవహరించగా, ఎన్నికల ప్రక్రియను ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాట్ల హరికుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యకలాపాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వడంతో పాటు నూతన విలేకరులకు సభ్యత్వ నమోదులో సహకరిస్తానని తెలిపారు. మండలంలోని 20 మంది విలేకరులతో ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏర్పాటవడం జర్నలిజం రంగానికి కొత్త ఊపునిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మేకల శ్యామ్, ఆళ్ల కొండ వెంకటేశ్వర్లు, కడారి బాబు, నాగిల్ల రజినీకాంత్, కనగండ్ల అఖిల్, కండె సంజీవ్, రాధారపు ఉదయ్, దాసరి గోపికృష్ణ, బుగ్గ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా జగిత్యాల మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి...

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనపై ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష..

జగిత్యాల జిల్లా, అక్టోబర్ 09:మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆర్అండ్‌బీ శాఖ



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, మెడికల్ కళాశాల విద్యార్థి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థుల సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. జగిత్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ శాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాలలో ఇంకా పూర్తికావాల్సిన నిర్మాణ పనులను గుర్తించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తరగతి గదులు, ఇతర అవసరమైన వసతులను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ పనులన్నింటినీ విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్‌కు, విద్యార్థి నాయకులకు హామీ ఇచ్చారు. పనుల పూర్తిలో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మెడికల్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీవో పి. మధుసూదన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# పునర్ పరిశీలనకు అవకాశం

అవనిగడ్డ అక్టోబర్ 9 శ్రీ వార్త భారత ఎన్నికల సంఘం వారిచే నిర్వహించబడిన సార్ 2026 (ఇంటెన్సివ్ రివిజన్) లో భాగంగా 76 అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 9619 ఓటర్లకు నోటీసులు జారీ చేసి కండక్ట్ చేయడం జరిగిందని ఎన్నికల అధికారి శ్రీనివాసరావు చెప్పారు. సదరు 9619 లో 496 మందికి నోటీసులు ఇచ్చిన ను ఇయర్ రింగ్ హాజరు కాలేదని కావున వీరిని ఇల్లేజిబుల్ గా గుర్తించడం జరిగిందని. సదరు 496 మందికి ఎన్నికల కమిషన్ తిరిగి పునర్ పరిశీలన చేయుటకు అవకాశం కల్పించిందన్నారు. కావున సదరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా శుక్రవారం ఒక ప్రకటనలో ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి కోరారు,ఎన్నికల సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడిన సర్ 2026 (ఇంటెన్సీ రివిజన్) కార్యక్రమంలో భాగంగా 76వ అవనిగడ్డ మండల పరిధిలో ఉన్న 1854 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసి ఇయర్ రింగ్ కండక్ట్ చేయడం జరిగిందని. మండల తాసిల్దార్ బి అంకాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు 1854లో 104 మందికి నోటీసులు ఇచ్చిన ను ఇయర్ రింగ్ కు హాజరు కాలేదు కావున వీరిని ఇన్ ఎలిజిబుల్ గా గుర్తించడం జరిగిందని సదరు 104 మందికి తిరిగి ఎన్నికల సంఘం పునర్ పరిశీలన చేయడానికి అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని ఈ 104 మంది సద్వినియోగం చేసుకోవాలని అంకాలు కోరారు,

# ఆహార పట్నాలు పంపిణీ చేస్తున్న కల్కి భగవాన్ ట్రస్ట్ సభ్యులు

## కల్కి భగవాన్ ట్రస్ట్ పిలుపుమేరకు ఆహార పొట్లాలు పంపిణీ



అవనిగడ్డ అక్టోబర్ 9 శ్రీ వార్త ఆధ్యాత్మిక గురువు కల్కి భగవాన్ ఇటీవల అనారోగ్య కారణాల వలన దైవ సన్నిధికి చేరిన సందర్భంగా కల్కి భగవాన్ ట్రస్ట్ పిలుపుమేరకు మండల పరిధిలోని పులిగడ్డ చౌరస్తాలో శుక్రవారం కల్కి భగవాన్ సేవకురాలు శైలజ ఆధ్వర్యంలో 150 మందికి ఆహార పట్ల లను పంపిణీ చేశారు. ఆహారమైన పులిహోర దద్దోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మోహన్. కల్కి భగవాన్ సేవకు సభ్యులు తదితరులు పాల్గొని ఆహార పట్నాలను పంపిణీ చేశారు,

# జై భవానీ నినాదంతో విధులు నిర్వర్తించాలి.

## అమ్మవారి సేవలో అంకితభావం.. విధుల్లో భక్తిభావం వెల్లివిరియాలి.

అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ దిశానిర్దేశం




విజయవాడ శ్రీ వార్త న్యూస్:విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే దసరా మహోత్సవాల సందర్భంగా అధికారులు, సిబ్బంది "జై భవానీ" నినాదంతో భక్తిశ్రద్ధలు, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. అమ్మవారి సేవలో పాల్గొనడం ఒక పవిత్రమైన అవకాశంగా భావిస్తూ దూరప్రాంతాల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవాభావంతో విధులు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. శుక్రవారం నగరంలోని డా. బి.ఆర్.అంబేద్కర్ కళావేదికలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, ఆలయ ఈవో వీకే శీనా నాయక్, అడిషనల్ సీపీ కేజీవీ సరిత, విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను తదితరులు దసరా విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గత సంవత్సరం 20 లక్షల మంది వరకు భక్తులు వచ్చారని ఈసారి 25 లక్షల వరకు భక్తులు రావచ్చని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. దసరా మహోత్సవాల విధుల్లో నియమితులైన సెక్టార్ ఇన్‌చార్జ్ అధికారులు, ఇతర సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాలను ముందుగానే సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని, విధుల మార్పిడి సమయంలో ముందుగానే హాజరై బాధ్యతలు స్వీకరించాలన్నారు. ప్రతి సెక్టార్‌లోని కీలక ప్రాంతాలు, సమస్యాత్మక ప్రదేశాలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ప్రణాళికలు, భద్రత ఏర్పాట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధుల్లో ఉన్న అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెంటనే చేరవేయాలని తెలిపారు. సామాన్య భక్తులకు ఎక్కడైనా అసౌకర్యం కలిగితే తక్షణమే స్పందించి పరిష్కరించాలని, వృద్ధులు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, దివ్యాంగుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యుత్, నిర్మాణాల భద్రత, తాగునీరు, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, క్యూలైన్లు, మహిళల భద్రత, చిన్నారుల సంరక్షణ, భక్తుల రాకపోకలకు సురక్షిత మార్గాలు, లైటింగ్, సూచిక బోర్డులు, సమాచార బోర్డులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఎక్కడైనా భక్తులు గుమిగూడితే కారణాన్ని వెంటనే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీధి వ్యాపారుల వల్ల భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసుల సమన్వయంతో వ్యవహరించాలన్నారు. భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఎల్లప్పుడూ ఖాళీగా ఉంచాలని, రహదారుల కూడళ్ల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, ప్రతి సెక్టార్‌కు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని స్పష్టం చేశారు.



భక్తులతో నిరంతరం మమేకమవుతూ ఆన్‌లైన్ సమాచార, అభిప్రాయ సేకరణ సదుపాయాలపై అవగాహన కల్పించాలని, ఏవైనా ప్రత్యేక సహాయ సహకారాలు అవసరమైతే జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ దసరా మహోత్సవాల్లో సామాన్య భక్తుల సంతృప్తి, భద్రతే అత్యున్నత ప్రాధాన్యమని, ప్రతి భక్తునికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే తమ కర్తవ్యమని, పని దైవంతో సమానం అనే స్ఫూర్తితో అంకితభావంతో విధులు నిర్వర్తించాలని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. సమావేశంలో సెక్టార్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భాద్రపద అమావాశ్య రోజున అన్నదానం, దాన ధర్మాలు చేయండి

ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు



హైదరాబాదు, శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి పితృ దేవతలు ఆశీర్వచనములు వలన వంశము కుటుంబము వృద్ధి చెందుతుందని రేపటి రోజు శనివారం భాద్రపదమాసంలో అమావాస్య చాలా విశేషమైనదని పితృపక్షాలు ("మహాలయ అమావాస్య") పురస్కరించుకుని కాలం చేసిన, గతించిన వారు, మీ ఇంటి పెద్దలు, బంధుల పేరు మీద "తిలతర్పణాలు" వదిలి బ్రాహ్మణోత్తముల చేత కాలం చేసిన పెద్దవారి పేరు, గోత్రాలు సంకల్పము చెప్పించుకుని యధావిధిగా "స్వయంపాకము, వస్త్రదానము, దానధర్మాలు, చేసి దక్షిణ తాంబూలాలు" ఇచ్చిన వారికి "పితృదోషాలు" పరిహారణ అయి పెద్దల ఆశీర్వచనములు కలుగుతాయని శాస్త్ర ప్రమాణమని ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు తెలిపారు. గతించిన మన పెద్దలు, కుటుంబ సభ్యులు భూమి మీదకు వచ్చి మన స్థితి గతులు గమనిస్తారని వారి పేరుతో పిండ ప్రధానలు, తర్పణాలు వదలాలని, ఉచితరీతిన దానధర్మాలు చేస్తే వారు సంతోషపడి మనకు సకల శుభాలు అందిస్తారని ఆయన వెల్లడించారు. అయితే కుటుంబ సభ్యులు కీచులాడుకోవడం, అశాంతి వాతావరణం చోటుచేసుకోవడం, గతించిన వారిని మరచిపోవడం వంటి దుశ్చర్యలకు పాల్పడితే వారు మన ఇంటివరకు వచ్చి కన్నీళ్లు పెట్టుకొని వెళ్ళిపోతారన్నారు. ఈ విధంగా జరిగితే మన కుటుంబానికి శ్రేయస్కరం కాదని ఆయన పేర్కొన్నారు. . కాబట్టి శనివారం రోజున అమావాశ్య రోజున తప్పనిసరిగా గతించిన పెద్దలను, కుటుంబ సభ్యులనుమనం స్మరించుకోవాలని, అవకాశం వున్న మేరకు అన్నదానములు, స్వయంపాకాలు ఇవ్వాలని, దాన ధర్మాలు చేయాలని ఆయన సూచించారు. పురాణ కథనం ఈ విధంగా వుంది కౌరవ పాండవుల కురుక్షేత్రం యుద్ధాంతరం ముందుగా కౌరవులు గతించారు. వారికి స్వర్గం ప్రాప్తించింది. అయితే పాండవులు ఎంతోకాలం రాజ్యాన్ని పాలించారు. వారి మరణానంతరం ధర్మ రాజు స్వర్గానికి వెళ్ళ లేకపోయాడు. దానికి కారణం ఏమిటంటే ఏనాడు ధర్మరాజు అన్నదానం చేయలేదని గ్రహించాడు. 15 రోజులపాటు దానధర్మాలు చేస్తే స్వర్గం ప్రాప్తిస్తుందని శ్రీకృష్ణ పరమాత్ముని ఉపదేశంతో 15 రోజులపాటు భూమిమీదకు వచ్చి ధర్మరాజు అన్నదానలు చేశాడు. దీనితో ధర్మరాజుకు స్వర్గం ప్రాప్తించింది. అందువల్ల సంవత్సరంలో అన్నదానం, దాన ధర్మాలు చేయాలని పండితులు సూచిస్తున్నారు.

# అయోధ్యలో ఘనంగా ముగిసిన జర్నలిస్టుల జాతీయ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో 'పెన్' సంఘం చేస్తున్న కృషిని అభినందించిన ఎన్‌యూజే (ఐ)

పెన్' ఆధ్వర్యంలో జాతీయ, ఉత్తరప్రదేశ్ జర్నలిస్టు సంఘాల నేతలకు సత్కారం




విజయవాడ, శ్రీ వార్త న్యూస్:ఉత్తరప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయోధ్యలో నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ జాతీయ కార్యవర్గ సమావేశాలు, ఇతర జాతీయ స్థాయి కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. అక్టోబర్ 4 నుంచి 6 వరకు మూడు రోజులపాటు నిర్వహించిన ఈ సమావేశాలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, జాతీయ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్‌యూజే (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్ తెలిపారు. ఎన్‌యూజే (ఐ) జాతీయ అధ్యక్షుడు సురేష్ శర్మ, సెక్రటరీ జనరల్ త్రియుగ్ నారాయణ్ తివారీ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశాల్లో జర్నలిస్టుల సమస్యలు, హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత, మీడియా రంగంలో ఎదురవుతున్న సవాళ్లపై చర్చించినట్లు ప్రభాకర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బడే ప్రభాకర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం జాతీయ సంఘం చేస్తున్న కృషిని వివరించారు. సమావేశాలను విజయవంతంగా నిర్వహించిన ఎన్‌యూజే (ఐ) జాతీయ నాయకులను, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర జర్నలిస్టు సంఘం నాయకులను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పెన్) తరఫున ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతోపాటు సంఘ అభ్యున్నతికి 'పెన్' చేస్తున్న కృషిని ఎన్‌యూజే (ఐ) నాయకులు అభినందించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని బడే ప్రభాకర్ పిలుపునిచ్చారు. త్వరలో నిర్వహించనున్న ఎన్‌యూజే (ఇండియా) ఎన్నికలను పటిష్ఠంగా, ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని రాష్ట్రాల నాయకులు సంసిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 'పెన్' సంఘం నాయకులు సింహాద్రి కృష్ణ ప్రసాద్, బద్దం సుమలత, లేబాక నాగేశ్వరరావు, గద్దిపాటి సుధీర్, బి. కృష్ణ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, కోట సుబ్బారావు, అన్నం శివరామకృష్ణ, బిడిఆర్ ప్రసాద్, పి. లక్ష్మణ్‌లను ఎన్‌యూజే (ఇండియా) జాతీయ నాయకులు ఘనంగా సన్మానించారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడంతోపాటు వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం అన్ని రాష్ట్రాల సంఘాలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఈ సమావేశాలు చాటిచెప్పాయి. సమావేశాలు అనంతరం అయోధ్య "బాల రాముని" ప్రత్యేక దర్శనం తో పాటు ఇతర ప్రముఖ క్షేత్రాలను సందర్శించడం జరిగింది.




# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసాగా ప్రజా ప్రభుత్వం.

70 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన పినపాక ఎమ్మెల్యే,

ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం అక్టోబర్ 09 ప్రతినిధిభద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 70 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం



రూ.70,08,120 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు ఆర్థిక భారంగా మారకుండా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ పథకాలు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, ఆడబిడ్డల వివాహాలను గౌరవప్రదంగా నిర్వహించుకునేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పేద కుటుంబాల అభ్యున్నతే లక్ష్యంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జములా రెడ్డి, ఎంపీవో రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ చారి, మండల హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి వారాల వేణు, స్థానిక సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, పార్టీ నియోజకవర్గ ఈ-బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, సర్పంచులు బాదం వెంకటేశ్వర రెడ్డి, పూనెం సురేందర్, బానోత్ పద్మ, బొర్ర సుభద్ర, తాటి వాణి, తాటి లక్ష్మి, బొల్లి నిరోష, శర్ప నాగమణి, మాజీ ఎంపీపీ కైపు రోసిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, యువజన నాయకులు భజన ప్రసాద్, చల్లా వెంకటనారాయణ, బాదం రమేష్ రెడ్డి, ఇంగువ రమేష్, పార్టీ మండల యువజన అధ్యక్షుడు హరీష్, యువజన విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రహీమ్ ఖాన్, మండల యువజన విభాగం ఉపాధ్యక్షుడు సుశాంత్ రెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, దాసరి సాంబ, చిప్పా రాజు, కాటం వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆఫ్రికా అంతర్జాతీయ ఆర్ట్ పోటీల్లో మంథని చిన్నారుల ప్రతిభ

త్రీడీ ఆర్టిస్ట్ శివరామకృష్ణ శిక్షణలో 83 మందికి ప్రశంసా పత్రాలు








మంథని, 09 అక్టోబర్ : ఆఫ్రికాలో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్ట్ పోటీల్లో ప్రముఖ త్రీడీ ఆర్టిస్ట్ సింగారపు శివరామకృష్ణ శిక్షణలో 83 మంది పాల్గొని అంతర్జాతీయ ప్రశంసా పత్రాలు సాధించారు. వీరిలో ఆయన కుమార్తె హిమానితో పాటు మంథనికి చెందిన 35 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. శివరామకృష్ణ స్థాపించిన ఎస్ఎస్ఆర్కే అకాడమీ, గ్లోబల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఆర్ట్స్ ద్వారా విద్యార్థులకు శిక్షణ అందించారు. 'యుద్ధం వద్దు.. శాంతి మాత్రమే కావాలి' అనే సందేశంతో రూపొందించిన చిత్రాలను పోటీ నిర్వాహకులకు పంపించారు. మంథనిలోని కాకతీయ, కృష్ణవేణి పాఠశాలల విద్యార్థులతో పాటు వివిధ రాష్ట్రాలు, అమెరికా, దుబాయ్, కువైట్, యూకే, స్వీడన్ తదితర ప్రాంతాలకు చెందిన చిన్నారులు, పెద్దలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల నిర్వహణలో సహకరించిన నాజీ బెనాజీకి శివరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశాలు కల్పించి, ప్రపంచస్థాయిలో వారి కళా నైపుణ్యాన్ని పరిచయం చేయడమే తన లక్ష్యమని శివరామకృష్ణ పేర్కొన్నారు. ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులు అభినందించారు.

## 60 గజాల ఇంటి స్థలాల కోసం 106 రోజులుగా రిలే నిరాహార దీక్ష



మొయినాబాద్ మున్సిపాలిటీ ప్రజల సమస్యలను పట్టించుకునే నాథుడే లేడని బాధితుల ఆవేదన

చేవెళ్ల నియోజకవర్గం, అక్టోబర్ 9:మొయినాబాద్ : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ ప్రజల సమస్యలను పట్టించుకునే నాథుడే లేడని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించిన 60 గజాల ఇంటి స్థలాలను అప్పగించాలని డిమాండ్ చేస్తూ నాలుగు యువజన సంఘాల ఆధ్వర్యంలో సర్వే నంబర్ 151లో చేపట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్ష శుక్రవారం నాటికి 106వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 290 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. అయితే 2007 నుంచి 2026 వరకు దాదాపు 19 సంవత్సరాలు గడిచినా, ఇప్పటివరకు తమకు కేటాయించిన స్థలాలపై భౌతిక స్వాధీనం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు కేటాయించిన ఇంటి స్థలాలను మాకు అప్పగించాలి. 60 గజాల స్థలాలు పొందడం మా న్యాయమైన హక్కు. మాకు స్థలాలు ఇచ్చి న్యాయం చేసే వరకు మా పోరాటం ఆగదు" అని బాధితులు స్పష్టం చేశారు. 106 రోజులుగా శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల వారు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదల సమస్యను పరిష్కరించాలని, పట్టాలు పొందిన 290 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలను అప్పగించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమీద శ్రీను, శాంతి యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విట్టల్, రెడ్డిపల్లి సుమన్, శాబాద్ ప్రవీణ్, శాబాద్ నాగరాజు, దార్గుపల్లి రాజేందర్, బైండ్ల యాదయ్య, కట్టమిది రత్నయ్య, కట్టమిది మల్లేష్, హిమాయత్‌నగర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కన్నాల పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



మంథని, 09 అక్టోబర్: మంథని మండలం కన్నాల పాఠశాలలో శుక్రవారం సాయంత్రం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి, వాటితో అందమైన బతుకమ్మలను పేర్చారు . విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలను అలంకరించి, వాటి చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పూలను పేర్చడం నుంచి బతుకమ్మ ఆటల్లో పాల్గొనడం వరకు విద్యార్థులు చూపిన ఆసక్తి, ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ ఆడపడుచులు ఎంతో వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించారు. చిన్ననాటి నుంచే పండుగల ప్రాధాన్యతను తెలుసుకోవడం, సంప్రదాయాలను గౌరవించడం ద్వారా సాంస్కృతిక విలువలను భావితరాలకు అందించవచ్చని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. పాఠశాల ఉపాధ్యాయినులు రాధిక, సావిత్రి, మమత పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులందరూ కలిసికట్టుగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొని వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.

## ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్వయంకృషి ఆశ్రమాన్ని సందర్శించిన జడ్జి ప్రియాంక...




జవహర్ నగర్, అక్టోబర్ 9( మేడ్చల్ – మల్కాజిగిరి న్యాయ సేవాధికారిక సంస్థ చైర్మన్ వి. బాలభాస్కర్ ఆదేశానుసారం సీనియర్ సివిల్ జడ్జి, సంస్థ కార్యదర్శి జీ ఎస్ ఎల్ ప్రియాంక... ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కారించుకుని జవహర్ నగర్ లోని స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ లో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంకృషి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మానసిక దివ్యాంగులు ప్రత్యేక అవసరాలు గలిగే విద్యార్థుల శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకి కల్పిస్తున్న వసతులు ,విద్య, వారు స్వయం శక్తితో ఎదిగేలా సంస్థ అందిస్తున్న చేయూతను తెలుసుకున్నారు



. మానసిక దివ్యాంగులు అన్ని రంగాల్లో ఎదిగేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు న్యాయ సేవాధికారిక సంస్థ సేవలు, చట్టాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులకు అందించే ఉచిత న్యాయ సేవలను ఎలా వినియోగించుకోవాలో తెలియజేశారు. అంతకు ముందు విద్యార్థుల తరగతి గదులను, వారు నేర్చుకుంటున్న అంశాలను జడ్జి ప్రియాంక స్వయంగా పరిశీలించారు. నిస్వార్థంగా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సేవలందిస్తున్న సంస్థ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో స్వయంకృషి వ్యవస్థాపకులు మంజుల కళ్యాణ్, న్యాయ సేవాధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేలను సద్వినియోగం చేసుకున్న యువత

మంత్రి శ్రీధర్‌బాబు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



భూపాలపల్లి నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్9భూపాలపల్లిలో మెగా జాబ్‌మేళాకు 142కుపైగా కంపెనీలు.. రెండు గంటల్లోనే 600 మందికి ప్రాథమిక ఎంపికబిలి యువత చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత వేతనాలతో కూడిన ఉద్యోగాలను సాధించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అలాగే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. అర్హతలతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు ఉంటే మెరుగైన ఉద్యోగాలు, పదోన్నతులు సాధించవచ్చని అన్నారు.నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రౌండ్‌లో శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాబ్‌మేళాలో ఏర్పాటు చేసిన వివిధ కంపెనీల స్టాళ్లను పరిశీలించి, ఉద్యోగ నియామక ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో నిర్వహించిన జాబ్‌మేళాలో 142కుపైగా కంపెనీలు పాల్గొని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రారంభంలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వేతనంతో ఉద్యోగంలో చేరినా, అనుభవం, నైపుణ్యాలను పెంచుకుంటే భవిష్యత్‌లో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వేతనం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.వ్యవసాయం, కూలీ పనులు, చిన్న వ్యాపారాలు చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదివిస్తున్నారని, వారి కష్టాన్ని గుర్తించి యువత ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాల కోసం ప్రాంతీయ పరిమితులు పెట్టుకోకుండా ఎక్కడ అవకాశం వచ్చినా అందిపుచ్చుకోవాలని, నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ కష్టపడి పనిచేస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని భరోసా ఇచ్చారు.పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించేందుకు ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు టాస్క్ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతోందని మంత్రి తెలిపారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించి మరింత మందికి ఉపాధి కల్పించేలా ప్రైవేటు సంస్థలతో సమన్వయం చేస్తున్నామని చెప్పారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రూప్–1, 2, 3, 4 పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులకు అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర విద్యార్హతలు కలిగిన యువతకు ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో జాబ్‌మేళాలు కీలకంగా నిలుస్తాయని అన్నారు.జాబ్‌మేళా ప్రారంభమైన రెండు గంటల్లోనే 600 మందికిపైగా యువత ప్రాథమికంగా ఎంపికైనట్లు మంత్రి వెల్లడించారు. కొన్ని కంపెనీలు ఒక్కొక్కటి 100 నుంచి 400 మందికిపైగా అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు.భూపాలపల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యంభూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కృషి చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రహదారుల అభివృద్ధి, పట్టణంలో రోడ్ల విస్తరణతో పాటు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానికంగానే మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సుమారు పది వేల ఉద్యోగావకాశాలు లక్ష్యం: భూపాలపల్లి నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా గొప్ప అవకాశమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఈ జాబ్‌మేళా ద్వారా సుమారు 10 వేల నుంచి 12 వేల వరకు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. టాస్క్ ద్వారా జిల్లాలో నైపుణ్యాభివృద్ధి శిక్షణను మరింత విస్తరించనున్నట్లు చెప్పారుసింగరేణి సంస్థ సహకారంతో శిక్షణ కేంద్రానికి విశాలమైన హాలు, ఏసీ వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి కూడా కృషి చేస్తున్నామని వెల్లడించారు. గత సంవత్సరం నిర్వహించిన మెగా జాబ్‌మేళా ద్వారా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుత అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.అర్హతకు తగ్గ ఉద్యోగం సాధించాలి: కలెక్టర్జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాకు 142కుపైగా కంపెనీలు హాజరయ్యాయని తెలిపారు. స్థానికంగానే కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నందున యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలను సాధించేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మెగా జాబ్‌మేళా విజయవంతంగా నిర్వహించేందుకు విశేష కృషి చేసిన జిల్లా యంత్రాంగాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సంకీర్త్, టాస్క్ సీఈఓ ప్రదీప్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధి హామీ పథకం డైరెక్టర్ దండు రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా, జవాబుదారితనంతో అమలు చేయాలి.

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల.




మంచిర్యాల జిల్లా ప్రతినిధి :- అక్టోబర్ 09 ప్రజలకు, ప్రభుత్వ పాలనకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా అందించడంతో పాటు, ప్రభుత్వ శాఖలలో జవాబుదారితనాన్ని పెంపొందించేలా సమాచార హక్కు చట్టం--2005ను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలు--2026ను పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుభాష్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపిసివి ఆనంద్, పిసిసిఎఫ్ వినయ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బెనహర్ మహేష్ దత్, రాష్ట్ర సమాచార కమిషన్ ముఖ్య కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి లతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని అన్ని జిల్లాల సమీకృత కలెక్టరేట్‌లలోని సమావేశ మందిరాల నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రజలకు సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వ పాలనలో పారదర్శ కత, అధికారుల పనితీరులో జవాబ ుదారితనం పెరుగుతాయని తెలిపారు. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, దుర్వినియోగం కాకుండా చూడవలసిన బాధ్యత అధికారులు, పౌర సమాజంపై ఉందని తెలిపారు. చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ, నిర్ణీత గడువులోగా దరఖాస్తులకు సమాధానాలు అందించాలని అధికారులకు సూచించారు. జిల్లా స్థాయిలోనూ సమాచార హక్కు చట్టంపై అవగాహనను



పెంపొందిస్తూ, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం--2005ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అమలు చేస్తూ ప్రజలకు చట్టబద్ధంగా అందించవలసిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందిస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ శాఖలలో సమాచార నిర్వహణను మెరుగుపరచడం, ప్రజలకు సమాచారాన్ని సులభంగా అందుబాటులో ఉంచడం, చట్టం పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించడంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషన్ అందిస్తున్న సేవలు, సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించిన అంశాలను వివరించే 'సమాచార దర్పణం' బ్రోచర్‌ను ఆవిష్కరించారు.రాష్ట్రవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు అవార్డులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎవరు దొంగిలించలేని సంపద "విద్య" మాత్రమే

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి పి.చంద్రయ్య.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి :- అక్టోబర్ 09 ఎవరు దొంగిలించలేని సంపద "విద్య" మాత్రమేనని, విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి లతో కలిసి సి.ఎం. బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆకలితో ఉంటే ఉపాధ్యాయులు బోధించే పాఠాలపై ఏకాగ్రత తగ్గుతుందని, పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఏకాగ్రతతో విద్య అభ్యసించేందుకు ఆకలి సమస్య లేకుండా రుచికరమైన, నాణ్యమైన అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యతో ఏదైనా సాధించవచ్చు అని, ఉన్నత స్థాయికి ఎదగవచ్చని, ఎవరు దొంగిలించలేని సంపద విద్య




మాత్రమేనని, విద్య పంచేకొద్దీ పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అల్పాహార పథకాన్ని చేపట్టిందని, బాలికలు రక్తహీనత సమస్యతో బాధపడకుండా అల్పాహారం, మధ్యాహ్న భోజనం లో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తూ నాణ్యమైన విద్యా బోధన అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణను అందిస్తున్నామని, ఉపాధ్యాయులు ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించి మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు అందుబాటులో ఉంచి ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బెల్లంపల్లి శాసనసభ్యులు మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ విద్య సంస్థలలో నాణ్యమైన విద్యా బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు సబ్జెక్టు లపై అవగాహన కలిగి ఉండాలని, ఇంగ్లీషు భాష పై పట్టు సాధించాలని, చదవడం, రాయడం, మాట్లాడడం నేర్చుకోవాలని తెలిపారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తుందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యతో పాటు క్రీడారంగం, సామాజిక బాధ్యతతో విద్యార్థులు ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బతుకమ్మ కానుకలుగా ఆ 2 పథకాలు? కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ఆసక్తికర ట్వీట్!




**హైదరాబాద్, :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో బతుకమ్మ కానుకలుగా రెండు కొత్త పథకాలను ప్రారంభించబోతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆయన తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతా వేదికగా స్పందించారు. రాష్ట్రంలో 1.67 కోట్ల మంది మహిళలకు నెలకు రూ. 2,500 అందించే 'మహాలక్ష్మి' పథకం, అలాగే బీపీఎల్ కుటుంబాలకు చెందిన 18 ఏళ్లు నిండిన యువతుల వివాహాల కోసం కల్యాణ లక్ష్మి పథకం కింద 10 గ్రాముల తులం బంగారం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ప్రచారం జరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రెండు హామీలను ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే, కనీసం ఇప్పటికైనా.. దాదాపు 1000 రోజుల తర్వాత ప్రభుత్వం నిద్రలేచి ఈ పథకాలను అమలు చేయడానికి ముందుకు రావడంపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హామీల అమలులో తీవ్ర జాప్యం జరిగిందంటూ కాంగ్రెస్ సర్కార్‌ను ఆయన ఎండగట్టారు.

## ఢిల్లీలో ఆంక్షలపై సుప్రీం ఫైర్..! భద్రత పేరుతో మూసేస్తారా ?




**న్యూఢిల్లీ,:** సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఢిల్లీలో నేడు జరగనున్న కాక్రోచ్ జనతా పార్టీ నిరసన నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా 57 మెట్రో స్టేషన్లను మూసివేయడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. భద్రతా కారణాలతో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవచ్చని, అయితే సాధారణ ప్రజలు ప్రజా రవాణాను వినియోగించుకునే హక్కును కూడా పరిరక్షించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. భద్రతా పరిమితులు విధించడం అంటే అన్ని కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయడం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నిరసన సందర్భంగా అదుపులేని జనసమూహం లేదా సంఘవిద్రోహ, దేశ వ్యతిరేక శక్తుల ప్రమేయం ఉంటుందనే ఆందోళన ఉంటే ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు తీసుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. సీజేపీ నిరసనకు ముందు ఢిల్లీలో పలు రహదారులను మూసివేయడంపై కూడా సుప్రీంకోర్టు స్పందించింది. బారికేడ్ల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రాంతాల్లో ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గాల గురించి ముందుగానే సమాచారం అందించాలని సూచించింది. ఈ అంశంపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, కోర్టు వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వానికి తెలియజేస్తానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల వల్ల ఏదో తప్పు జరుగుతోందనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోందని కూడా ఆయన పేర్కొన్నారు. రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లలో ఇప్పటికే సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని, అవసరమైతే ప్రభుత్వం ఇతర భద్రతా చర్యలను కూడా అమలు చేయవచ్చని సీజేఐ గుర్తుచేశారు. అయితే భద్రతా ఏర్పాట్ల పేరుతో సాధారణ పౌరులు మెట్రో, రైల్వే స్టేషన్లకు వెళ్లకుండా నిరోధించకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిరసనలను నియంత్రించేందుకు నిబంధనలు విధించవచ్చని, కానీ వాటి వల్ల అన్ని కార్యకలాపాలను నిలిపివేయలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుంటూనే ప్రజా రవాణా, రహదారుల వినియోగం, ప్రయాణికుల సౌకర్యాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. మరోవైపు పోలీసుల అనుమతి లేకుండా చేసే నిరసనలు చట్ట విరుద్ధమైనవిగా పరిగణిస్తామని కూడా సుప్రీంకోర్టు తెలిపింది. ఇప్పటికే కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులు పోలీసుల అనుమతి అవసరం లేదని చెప్తున్నారు. దీంతో వారు పోలీసుల అనుమతి కూడా కోరలేదు.

## ట్యాంక్‌బండ్‌పై బర్త్‌డేనా.. సజ్జనార్ హెచ్చరిక



హైదరాబాద్: సీపీ సజ్జనార్ కీలక విజ్ఞప్తి చేశారు. ట్యాంక్ బండ్‌పై పుట్టినరోజు వేడుకలు లేదా కేక్ కటింగ్‌లు వద్దని అర్ధరాత్రి వేళల్లో రోడ్లపైకి వచ్చి ప్రాణాలను ప్రమాదంలో పెట్టవద్దని సూచించారు. నగరవాసులకు, ముఖ్యంగా యువతకు తల్లిదండ్రులకు తాము ఈ విషయాన్ని విజ్ఞప్తి చేస్తున్నామని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో.. ట్యాంక్ బండ్ సమీపంలో, అలాగే నగరంలోని ప్రధాన రహదారులు, సరస్సులు మరియు పార్కుల వద్ద అర్ధరాత్రి వేళల్లో పుట్టినరోజు వేడుకలు లేదా కేక్ కటింగ్‌లు నిర్వహించవద్దు. ఆనందంగా జరగాల్సిన పుట్టినరోజు వేడుకలు, క్షణికమైన అజాగ్రత్త మరియు నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలను పూడ్చలేని దుఃఖంలో ముంచెత్తడం హృదయ విదారకం. కేవలం రెండు రోజుల క్రితం, తెల్లవారుజామున 2 గంటలకు, ట్యాంక్ బండ్‌పై జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో, వారి పుట్టినరోజున ఆరేళ్ల బాలుడు, అతని కుటుంబ సభ్యుడు విషాదకరంగా మరణించారు. ఈ ఘటన ప్రతి ఒక్కరినీ తీవ్రంగా కలచివేసింది. మా సిబ్బంది వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి, ప్రాణాలను కాపాడటానికి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, మేము ఈ నష్టాన్ని నివారించలేకపోయాము. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు, మేము సీనియర్ పోలీసు అధికారుల సహకారంతో ట్యాంక్ బండ్‌పై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతంలో తనిఖీ నిర్వహించి, పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాము. అక్కడ జరుగుతున్న ప్రమాదాలపై వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో సమగ్ర సమీక్ష కూడా నిర్వహించాము. పుట్టినరోజు అనేది ఒక వ్యక్తిగత కుటుంబ వేడుక అని, దానిని కేవలం ఇళ్లలో లేదా ఏదైనా సురక్షితమైన, మూసి ఉన్న ప్రదేశాలలో మాత్రమే జరుపుకోవాలని మేము స్పష్టం చేస్తున్నాము. అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై పాదచారుల రద్దీ ఉండదు కాబట్టి, వాహనాలు అదుపు లేకుండా వేగంగా దూసుకుపోతాయి. అటువంటి సమయంలో చిన్న పిల్లలను వెంట తీసుకురావడం, రోడ్డు మధ్యలోకి రావడం ఏమాత్రం అవివేకమని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. వాస్తవానికి, నిబంధనల ప్రకారం ట్యాంక్ బండ్‌పై ఇలాంటి వేడుకలు జరుపుకోవడం పూర్తిగా నిషేధించబడింది. దీనిపై జీహెచ్ఎంసీ గతంలోనే స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. మా పోలీసులు నిరంతరం గస్తీ కాస్తూ, అక్కడికి వచ్చేవారిని చెదరగొడుతున్నప్పటికీ, ప్రజలు అర్ధరాత్రి వేడుకలు జరుపుకోవడానికి తిరిగి వస్తుండటంతో ఈ విషాదాలు పునరావృతమవుతూనే ఉన్నాయి. కేవలం క్షణికమైన సరదా కోసం చేసే పొరపాట్లకు అమూల్యమైన ప్రాణాలను కోల్పోవద్దు. ఇకపై ఎవరూ అర్ధరాత్రి వేళల్లో ట్యాంక్ బండ్, సరస్సులు లేదా బహిరంగ ప్రదేశాలకు వచ్చి కేరింతలు కొట్టవద్దని మేము విజ్ఞప్తి చేస్తున్నాము". అని తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

# ఆచి తూచి 'రిజర్వ్' అడుగు!

నిత్యం చోటుచేసుకునే జాతీయ, అంతర్జాతీయ పరిణామాలూ, ప్రకృతి వైపరీత్యాలూ, వాటి పర్యవసానంగా ఏర్పడగల ఆర్థిక సంక్షోభాలపై దృష్టి పెట్టడమే, కలత పడటమే... అందుకు విరుగుడు ఆలోచించటమే రిజర్వ్ బ్యాంకు అసలు పని. గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న ఆర్థికరంగ నిపుణులు రిజర్వ్ బ్యాంకు రెపో రేటు పెంచకతప్పదని అంచనా వేస్తున్నారు. నిజానికి ఆ విషయంలో కొంత ఆలస్యం అయిందన్నది కూడా వారి విశ్లేషణ. ఏమైతేనేం...రెపో రేటును పావు శాతం పెంచుతూ బ్యాంకు ద్రవ్య విధాన సంఘం(ఎంపీసీ) భేటీ బుధవారం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల గృహ, వాహన, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలపై వడ్డీ రేట్లు బాగా పెరుగుతాయి. మధ్యతరగతి జీవులు ఈఎంఐలకు అధికంగా చెల్లించకతప్పదు. మూడేళ్ల క్రితం రెపో రేటు పెంచాక ఇదే మొదటి పెంపు. ఇన్నాళ్లూ రెపో రేటులో ఎలాంటి మార్పు లేకుండా కొనసాగించటం... అటుపై కొంచెం కొంచెం తగ్గించుకుంటూ రావటమే అందరూ చూశారు. మొత్తానికి వడ్డీ రేటు 5.25 శాతం దగ్గర స్థిరపడింది. పావు శాతం పెంచటంతో ఇప్పుడది 5.50 శాతానికి చేరింది. కానీ ఇదింకా పెరుగుతుందన్న సంకేతాలిచ్చింది. మూడేళ్ల తటస్థంనుంచి 'క్రమానుగత కఠిన విధానం' దిశగా కదులుతున్నట్టు తెలిపింది. దసరా పండుగ సంరంభం సమీపిస్తుండగా తీసుకున్న ఈ నిర్ణయం సహజంగానే వినియోగదారుల కొనుగోలుశక్తిపై ప్రభావం చూపుతుంది. దాని తీవ్రత మరీ ఎక్కువ ఉండరాదని పావు శాతం పెంపునకు పరిమితమైంది. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక తీసుకుంటున్న నిర్ణయాలు అన్ని దేశాల ఆర్థికవ్యవస్థలనూ తలకిందులు చేస్తున్నాయి. విచక్షణారహితంగా విధిస్తున్న అదనపు సుంకాలు మనతో సహా ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నాయి. ముడి చమురు ధరలు ఆకాశాన్నంటడానికి దారితీసిన పశ్చిమాసియా సంక్షోభం కూడా ఆయన పుణ్యమే. నేనున్నానంటూ సూపర్ ఎల్ నినో కూడా ఇప్పుడే వచ్చిపడింది. సాగురంగాన్ని అది తీవ్రంగా దెబ్బతీస్తోంది. వీటన్నిటివల్లా కనుచూపు మేరలో ఆశాజనకమైన పరిస్థితుల జాడ ఉండబోదని అందరికీ తెలుస్తూనే ఉంది. ఆహారధాన్యాల ధరలు అలా పైపైకి పోవటమే తప్ప కిందికి దిగొస్తున్న




దాఖలా లేదు. రూపాయి పతనం ఎన్నడూ లేనంతగా ఉంది. ద్రవ్యోల్బణం పెరగటంతో నిజ వేతనాలు గణనీయంగా పడిపోయాయి. మార్కెట్‌కి వెళ్లడం పాపం... జేబు ఖాళీ అవుతోంది. మధ్యతరగతి ఆదాయాలు పడిపోతుంటే... నిరుద్యోగ భూతం భయపెడుతోంది. స్టాక్ మార్కెట్లు సరేసరి. గత తొమ్మిది నెలల్లో విదేశీ సంస్థాగత మదుపుదార్లు 4 లక్షల కోట్ల రూపాయలుపైగా వెనక్కు తీసుకున్నారని అంచనా. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాలను దాటి 7.8 శాతానికి గెంతడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అంతర్జాతీయంగా సంక్షోభం ఉన్నా మన ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండటమే కాదు...మెరుగైన దోవన వెళ్తున్నదని కేంద్రం ప్రకటించింది. మొన్న ఆగస్టుకు ద్రవ్యోల్బణం 4.82 శాతం ఉన్నదని లెక్కేశారు. మరి అప్పుడే రెపో రేటు పెంచాల్సివుండగా ఎందుకు ఆగినట్టని ఆర్థిక రంగ నిపుణులు వేస్తున్న ప్రశ్న హేతుబద్ధమైనదే. పరిస్థితులు బాగులేవన్నది నిజమే అయినా... ఆగస్టునాటికీ, ఇప్పటికీ వచ్చిన గణనీయమైన మార్పేమీ లేదు. సరఫరాకు సంబంధించిన ఒత్తిళ్లు లేదా డిమాండ్ పరమైన ఒత్తిళ్లు ఉన్నప్పుడే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రస్తుతం ఆ రెండూ లేవు. అయినా రేటు పెంచటమంటే ముందు జాగ్రత్త అనుకోవాలి. వృద్ధి రేటు లెక్క సరికాదని విభేదించినవారు గణనీయంగానే ఉన్నారు. ఆ మాటెలావున్నా 7.8 శాతం వృద్ధి రేటు అనేది నిర్భయంగా రెపో రేటు పెంచటానికి ఏ సెంట్రల్ బ్యాంకుకైనా అనువైనది. అది నేలచూపులు చూస్తుంటే పెంచితే అన్ని రకాల రుణాలపైనా వడ్డీ రేట్లు పెరిగి జనం మరింత కుంగుతారు. ఇలా బాగున్న వాతావరణమే పెంపుదలకు అనుకూలమని బ్యాంక్ భావించటంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఈ పెంపు ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తుందా లేదా అన్నది చెప్పలేం. అదనపు లిక్విడిటీని అదుపు చేయటంద్వారా అది సాధ్యమేనని ఎంపీసీలోని మెజారిటీ సభ్యులు భావించారు. చూద్దాం... ఏమవుతుందో!

# జీడీపీ ముసుగులో వలసవాదం..

వలసవాద వ్యతిరేకతను గాంధీజీ కేవలం విదేశీ పాలన నుంచి రాజకీయ స్వాతంత్ర్యం పొందే పోరాటంగా మాత్రమే చూడలేదు.. దేశ ఆర్థిక వ్యవస్థపై, ఉత్పత్తి సాధనాలపై, ప్రజల జీవన విధానంపై విదేశీ ఆధిపత్యాన్ని తొలగించడం కూడా నిజమైన స్వాతంత్ర్యంలో భాగమని భావించారు.. ఆయన దృష్టిలో స్వాతంత్ర్యం అంటే పాలకులు మారడం మాత్రమే కాదు.. ప్రజలు ఆర్థికంగా స్వతంత్రులై, తమ శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతూ, దోపిడీకి దూరంగా గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం. నేటి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేట్ ఆధిపత్యం, పెరుగుతున్న ఆర్థిక అసమానతలను పరిశీలించినప్పుడు గాంధీజీ వలసవాద వ్యతిరేక ఆలోచనలు సమకాలీన ఆర్థిక విధానాలపై కీలకమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

### సరళీకృత ఆర్థిక విధానాల తర్వాతే..

మన దేశంలో 1991 నుంచి సరళీకృత ఆర్థిక విధానాల అమలు తర్వాత ప్రభుత్వ రంగంలో ప్రైవేటీకరణ పెరిగింది. 2013లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 17.3 లక్షల ఉద్యోగాలు ఉండగా, 2022 నాటికి అవి 10 లక్షలకు తగ్గాయి. వీటిలోనూ 43% మంది కాంట్రాక్టు కార్మికులుగా నియమితులయ్యారు.. ఇలా దేశంలో మెల్లగా ప్రైవేటు, కార్పొరేట్ రంగాల విస్తరణతో తగిన ఉద్యోగాలు లభించక నిరుద్యోగులు గిగ్ వర్కర్లుగా జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 35 ఏళ్లలోపు భారతీయుల్లో 65 % మంది, పట్ట భద్రుల్లో 40% మంది, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 80% మంది నిరుద్యోగులుగా ఉన్నారని పేర్కొంది. ఫలితంగా దేశంలో ఆదాయ అసమానతలు పెరిగాయి. దేశ తలసరి ఆదాయం సుమారు 3,000 డాలర్లు కాగా, ధనికుల ఆదాయాలు భారీగా కేంద్రీకృతమయ్యాయి. దేశంలోని సంపదలో పై 10% ధనికుల వాటా 77 శాతంగా ఉండగా, దిగువ 50% ప్రజల వాటా కేవలం 4.1 శాతంగా ఉంది.

### అభివృద్ధి అంటే.. అందరి వృద్ధి!

గాంధీజీ దృష్టిలో అభివృద్ధి అంటే కొందరి వృద్ధి కాదు, అందరి వృద్ధి. ప్రజల కనీస అవసరాలు తీర్చి, అందరికీ సంక్షేమం కల్పించేదే నిజమైన రాజ్యం. పెట్టుబడిదారీ వ్యవస్థ నిరుద్యోగాన్ని నిర్మూలించలేదని ఆయన భావించారు.. ఆర్థిక వికేంద్రీకరణ, స్వయం



సమృద్ధి, పరస్పర సహకారం, సమానత్వం, అహింస, గ్రామీణ స్వయం పోషకత్వం, స్వదేశీ ఉత్పత్తి వంటి విధానాలు దేశాభివృద్ధికి, మానవ శ్రేయస్సుకు పునాదులని విశ్వసించారు. ఉత్పత్తి, పంపిణీలోని అసమానతలను తొలగించి, పేదరికం, నిరుద్యోగం లేని సమాజాన్ని నిర్మించడమే ఆయన లక్ష్యం. నేటి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తి గణనీయంగా పెరిగినా, మానవ శ్రేయస్సు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం శోచనీయం. అందుకే భారీ ఉత్పత్తి కంటే అధిక సంఖ్యలో ప్రజలు ఉత్పత్తి ప్రక్రియలో భాగస్వాములై ఉపాధి, ఆదాయం పొందడమే ముఖ్యమని గాంధీజీ నొక్కిచెప్పారు..

### జీడీపీ.. ప్రజా శ్రేయస్సు సూచిక కాదు!

బిలియనీర్ల పెరుగుదలకు, జీడీపీ వృద్ధికి సంబంధం ఉండవచ్చుగానీ, నిరుద్యోగ నిర్మూలనకు ప్రత్యక్ష సంబంధం లేదు. మన దేశంలో జీడీపీ వృద్ధి సమ్మిళితంగా సాగక, జనాభాలో సగం మందికి దాని ప్రయోజనాలు అందడం లేదు.. అందుకే జీడీపీ పెరుగుదలే ఆర్థికాభివృద్ధికి కొలమానం కాదని, ఉద్యోగ కల్పన, ప్రజల ఆదాయాలు, సంక్షేమం కూడా ముఖ్యమని గుర్తించాలి. ఒక దేశ ప్రగతిని కొలవడానికి జీడీపీ ఒక్కటే సరిపోదని ఐక్యరాజ్యసమితి నిపుణుల బృందం స్పష్టం చేసింది. 2025 మేలో ఐరాస సెక్రటరీ జనరల్ ఏర్పాటు చేసిన ఈ బృందం, జీడీపీకి అతీతంగా ప్రగతిని కొలిచేందుకు నాలుగు ప్రధాన అంశాలు, 31 సూచికలతో కూడిన డాష్‌బోర్డును ప్రతిపాదించింది. ఇందులో శాంతి, మానవ హక్కులు, ప్రకృతి పట్ల గౌరవం, పర్యావరణ పరి రక్షణ వంటి అంశాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. దశాబ్దాలుగా జీడీపీ వృద్ధినే ప్రగతికి కొలమానంగా పరిగణిస్తున్నప్పటికీ, అసమానతలు, పర్యావరణ క్షీణత, ప్రభుత్వ సంస్థలపై తగ్గుతున్న విశ్వాసం కొనసాగుతున్నాయని పేర్కొంది. కాబట్టి దేశాభివృద్ధిని కేవలం ఆర్థిక వృద్ధితో కాకుండా, ప్రజల సంక్షేమం, సమానత్వం, పర్యా వరణ పరిరక్షణ ఆధారంగా కూడా అంచనా వేయాలి.

### వృద్ధిరేటు పెరుగుదల ఎవరి కోసం?

ప్రపంచీకరణ క్రమం ప్రారంభం అయ్యాక అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఆయా దేశాల జీడీపీ అంచనాలు అవసరం అయ్యాయి.. అందుకే మూడవ ప్రపంచ దేశాల పాలకులు అధిక వృద్ధిరేటును ప్రచారం చేస్తూ విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి నయా ఉదారవాద విధానాలను బలపరుస్తున్నారు. దీంతో ఆర్థిక వ్యవస్థలు పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా మారుతున్నాయి.. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడుల అవసరాల కోసం త్వరిత, సవరించిన ఆర్థిక అంచ నాలు రూపొందిస్తున్నారు. ఈ విధానాలు మూడవ ప్రపంచ దేశాలు పూర్తిస్థాయి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలుగా మారి నట్లు భావిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. ఇప్పటికీ అనేకమంది చిన్న రైతులు చిన్న కమతాల్లో వ్యవ సాయం చేస్తుండగా, చేతివృత్తిదారులు సంప్రదాయ పద్ధతులపైనే ఆధారపడుతున్నారు. ఫలితంగా, మన దేశంలో అశేష ప్రజానీకం పెట్టుబడిదారీ వృద్ధి ఫలాలకు దూరంగా ఉంటున్నారు.

# ఏఐ వెనుక దాగిన నీటి దాహం..

తెరపై క్షణాల్లో సమాధానం ఇచ్చే కృత్రిమ మేధస్సు వెనుక వేలాది సర్వర్లు నిరంతరం పనిచేస్తుంటాయి. అవి విపరీతమైన వేడిని ఉత్పత్తి చేస్తాయి.. ఆ వేడిని అదుపులో ఉంచేందుకు శీతలీకరణ అవసరం. కొన్ని శీతలీకరణ పద్ధతులకు నీరు అవసరం. అంటే మనకు కనిపించని గణన ప్రపంచం వెనుక కనిపించే ప్రకృతి వనరుల వినియోగం దాగి ఉంది. భారతదేశంలో సమాచార కేంద్రాల సామర్థ్యం 2020లో 375 మెగావాట్లుగా ఉండగా, 2026 నాటికి సుమారు 1,575 మెగావాట్లకు చేరింది. కృత్రిమ మేధస్సు, అధిక సామర్థ్య గణన విస్తరణతో ఈ అవసరం మరింత పెరగనుంది. 2031-32 నాటికి సమాచార కేంద్రాల విద్యుత్ అవసరం సుమారు 17 గిగావాట్లకు చేరవచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది.

### మరి నీటి సంగతి ఏమిటి?

సమాచార కేంద్రం అంటే కేవలం కంప్యూటర్ల గది కాదు.. వేలాది సర్వర్లు నిరంతరం పనిచేసే పారిశ్రామిక మౌలిక వసతి. గణన శక్తి పెరిగే కొద్దీ వేడి పెరుగుతుంది. దాన్ని తొలగించడానికి శీతలీకరణ వ్యవస్థలు పని చేయాలి. అయితే ప్రతి కేంద్రం ఒకే స్థాయిలో నీటిని వినియోగించదు. సాంకేతికతను బట్టి నీటి అవసరం మారుతుంది. సర్వర్ చిప్‌కు నేరుగా ద్రవంతో చల్లబరచడం, ద్రవంలో ముంచి చల్లబరచడం, ఆవిరీభవన ఆధారిత శీతలీకరణ, నీటిని తిరిగి వినియోగించే మూసివేసిన వ్యవస్థలు వంటి పద్ధతులు నీటి వినియోగాన్ని తగ్గించగలవని కేంద్రం చెబుతోంది. అందు వల్ల ప్రతి సమాచార కేంద్రం భూగర్భ జలాలను భారీగా ఖాళీ చేస్తుందని చెప్పడం సరికాదు.. కానీ నీటి కొరత ఉన్న ప్రాంతంలో పెద్ద నీటి వినియోగదారు చేరితే స్థానిక జల సమతుల్యతపై ఒత్తిడి పెరగడం మాత్రం సాధ్యమే.

భూగర్భ జలాలపై దీని ప్రభావం ఎంత?

భూమి మీద నీరు తగ్గితే కనిపిస్తుంది. భూమి కింద నీరు తగ్గితే వెంటనే కనిపించదు. బోర్లు పనిచేస్తూనే ఉంటాయి. మోటార్లు నీటిని తోడుతూనే ఉంటాయి. కానీ భూమిలోకి చేరే నీటి కంటే వెలికితీత ఎక్కువైతే నీటి మట్టం నెమ్మదిగా దిగజారుతుంది. దేశంలో 2025 అంచనాల ప్రకారం వార్షిక భూగర్భ జలాల వెలికితీత 247 బిలియన్ ఘనపు మీటర్లు.. ఇందులో 87 శాతం వ్యవసాయానికి, 11 శాతం




గృహ అవసరాలకు, 2 శాతం పరిశ్రమలకు వినియోగమవుతున్నాయి. కాబట్టి దేశవ్యాప్తంగా భూగర్భ జలాల సంక్షోభానికి సమాచార కేంద్రాలనే ప్రధాన కార ణంగా చూపడం వాస్తవికం కాదు. కానీ ఇప్పటికే నీటి ఒత్తిడి ఉన్న ప్రాంతాల్లో కొత్త భారీ వినియోగదారులు చేరినప్పుడు వాటి సమష్టి ప్రభావాన్ని తప్పనిసరిగా లెక్కించాలి.

పర్యావరణ అసమతుల్యత ప్రమాదం ఉందా?

సమాచార కేంద్రం ఎక్కడ నిర్మించాలన్న ప్రశ్నకు పెట్టుబడి విలువ ఒక్కటే ప్రమాణం కాకూడదు.. అక్కడ నీరు ఎంత ఉంది? ఎంత పునః భర్తీ అవుతున్నది? ఇప్పటికే వ్యవసాయం, తాగునీరు, పరిశ్రమలు ఎంత వినియోగిస్తున్నాయి? కేంద్రానికి అవసరమైన నీటిలో ఎంత భాగాన్ని శుద్ధి చేసిన నీటితో భర్తీ చేయవచ్చు? మరిన్ని కేంద్రాలు వస్తే మొత్తం జలభారం ఎంత అవుతుంది? ఈ ప్రశ్నలకు ముందుగానే సమాధానం ఉండాలి.

అనుమతి ఇవ్వడంతోటే సరిపోదు..

కృత్రిమ మేధస్సు విస్తరణకు భారీ గణన శక్తి అవసరం. దానికి భారీ విద్యుత్ అవసరం. ఆ విద్యుత్ పునరుత్పాదక వనరుల నుంచి వస్తే పర్యావరణ భారం తగ్గవచ్చు. బొగ్గు ఆధారిత విద్యుత్‌పై ఆధారపడితే కర్బన ఉద్గారాల భారం పెరుగుతుంది. అందుకే భవిష్యత్ విధానంలో ఒక్కో సమాచార కేంద్రానికి అనుమతి ఇవ్వడం మాత్రమే కాకుండా, ఒక ప్రాంతపు మొత్తం జల, విద్యుత్ సామర్థ్యాన్ని అంచనా వేసి ఆ ప్రాంతం ఎంత డిజిటల్ మౌలిక వసతిని మోయగలదో నిర్ణయించే విధానం అవసరం.

పునాదిలోనే నీరు ఎండిపోతే..?

భారత్ ఏఐలో ముందుకు వెళ్లాలి. పెట్టుబడులు రావాలి. డిజిటల్ మౌలిక వసతులు పెరగాలి. కానీ అభివృద్ధి పేర నీటి భద్రతను తాకట్టు పెట్టకూడదు.. ప్రతి కొత్త సమాచార కేంద్రానికి నీటి లెక్క, ప్రతి కేంద్రానికి ఒక విద్యుత్ లెక్క ఉండాలి. ప్రతి పెద్ద పెట్టుబడికి పర్యావరణ లెక్క ఉండాలి. కృత్రిమ మేధస్సు ఎంత తెలివిగా మారుతుందో కొలవడం మాత్రమే కాదు.. దాని వెనుక ఎంత నీరు ఖర్చువుతున్నదో, ఎంత విద్యుత్ వినియోగమవుతున్నదో, ఎంత కర్బన ముద్ర మిగులుతున్నదో కూడా కొలవాలి. క్లౌడ్‌లో భవిష్యత్తును నిర్మించవచ్చు. దానికి పునాది భూమిపైనే ఉంటుంది. ఆ పునాదిలో నీరు ఎండిపోతే.. కృత్రిమ మేధస్సు ఎంత తెలివైనదైనా, మనిషి భవిష్యత్తును మాత్రం తెలివిగా కాపాడలేదు.

## భారత సంతతి నవనీతమ్ నవీ పిళ్లైకి నోబెల్ శాంతి బహుమతి!



ఓస్లో: ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే 2026 సంవత్సరపు నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడింది. అంతర్జాతీయ చట్టాల పరిరక్షణకు, ప్రపంచ శాంతి స్థాపనకు, మానవ హక్కుల పరివర్తనకు దశాబ్దాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న ప్రముఖ దక్షిణాఫ్రికా న్యాయకోవిదురాలు, భారతీయ తమిళ సంతతికి చెందిన నవనీతమ్ నవీ పిళ్లై ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. నవీ పిళ్లై తల్లిదండ్రులు భారత్ నుంచి వలస వెళ్లిన తమిళ కుటుంబానికి చెందినవారు. దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో ఆమె సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. సౌతాఫ్రికా హైకోర్టులో తొలి మహిళా జడ్జిగా, యుగోస్లేవియా అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్ జడ్జిగా, రువాండా నరమేధ ట్రిబ్యునల్ అధ్యక్షురాలిగా ఆమె కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2008 నుంచి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా ఆమె ప్రపంచ వ్యాప్తంగా అణగారిన వర్గాల గొంతుకగా నిలిచారు. వివక్షకు వ్యతిరేకంగా, మహిళల హక్కులు, శరణార్థుల రక్షణ కోసం నిర్విరామంగా పోరాడారు. మానవ హక్కుల పరిరక్షణలో ఆమె చేసిన విశేష కృషికి గాను గతంలో అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు ఆమెను వరించాయి. ఇందులో భాగంగానే 2024 సంవత్సరానికి గాను ఆమెకు ప్రతిష్టాత్మక సిడ్నీ శాంతి పురస్కారం లభించింది. తాజాగా ఆమె సేవలను గుర్తించిన నార్వే నోబెల్ కమిటీ అత్యున్నతమైన ‘నోబెల్ శాంతి బహుమతి–2026’ను ప్రకటించడంతో భారతీయులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మానవ హక్కుల పరిరక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ం

## ఉప ఎన్నికల కౌంటింగ్.. తమిళనాడులో దూసుకెళ్తున్న టీవీకే!



చెన్నై: దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేకెత్తిస్తున్న ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. అసోంలోని నాగావ్ లోక్‌సభ స్థానంతో పాటు, పశ్చిమ బెంగాల్, తమిళనాడులోని పలు అసెంబ్లీ స్థానాల్లో ప్రధాన పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ముఖ్యంగా తమిళనాడులో అధికార టీవీకే పార్టీ హవా స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో పోటీ జరుగుతున్న కీలక స్థానాల్లో టీవీకే అభ్యర్థులు ఘన విజయం దిశగా దూసుకెళు_న్నారు. మదురాంతకంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమరవేల్ తన సమీప ప్రత్యర్థిపై సుమారు 10వేల ఓట్ల ఆధిక్యంలో, ధారాపురంలో టీవీకే అభ్యర్థి పి. సత్యభామ 9500 ఓ?ట్ల ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ అనూహ్య ఆధిక్యాలతో తమిళనాడు వ్యాప్తంగా ఉన్న టీవీకే శ్రేణులు, కార్యకర్తలు భారీ ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. పార్టీ కార్యాలయాల వద్ద బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. తుది ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.ం

## అక్టోబర్ 10 సీజేపీ నిరసన : షాకిచ్చిన ఢిల్లీ పోలీసులు



న్యూఢిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్?తో ఆందోళన చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ కి ఎదురు దెబ్బ తగిలింది. శనివారం అక్టోబర్ 10 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. తక్కువ సమయంలో దరఖాస్తు చేయడం, గతంలో ఇచ్చిన హామీలను ఉల్లంఘించడం,ప్రస్తుతం ఉన్న శాంతిభద్రతల పరిస్థితిని కారణంగా చూపుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ నిరసన చేపట్టేందుకు అనుమతి కోరుతూ సీజేపీ కో–కన్వీనర్ సౌరవ్ దాస్ దరఖాస్తు సమర్పించినట్లు జాయింట్ పోలీసు కమిషనర్ నూపుర్ ప్రసాద్ తెలిపారు. నిబంధనల ప్రకారం కనీసం 10 రోజుల ముందే సమాచారం ఇవ్వాల్సి ఉండగా, చాలా తక్కువ సమయంలో దరఖాస్తు చేశారని పోలీసులు వీరి దరఖాస్తును తిరస్కరించారు. పైగా గతంలో అనుమతి పొందిన నిరసనలసమయంలో చట్టపరమైన ఆదేశాలను, తన సొంత హామీలను పాటించడంలో విఫలమైందని పోలీసులు వాదిస్తున్నారు. దీనికి తోడు న్యూఢిల్లీ ప్రాంతంలో సెక్షన్ 163 అమలులో ఉంది. దీనిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మరోవైపు జంతర్ మంతర్ వద్ద ముందస్తు భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఢిల్లీ వ్యాప్తంగా అదనపు బలగాలను మోహరించారు. అలాగే, శుక్రవారం రాత్రి నుండి న్యూఢిల్లీ జిల్లాలోని 57 మెట్రో స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణ గేట్లను మూసివేయాలని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఊవీ=జ)ను పోలీసులు కోరారు. గతంలో నీట్‌లో అక్రమాలు, విద్యార్థుల ఆత్మహత్యల నేపథ్యంలో అప్పటి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున చేపట్టిన ఉద్యమానికి సీజేపీ అనుమతినిచ్చిన ఢిల్లీ పోలీసులు తాజా నిరసనకు అనుమతిని నిరాకరించడం గమనార్హం. కాగా జంతర్ మంతర్ వద్ద తన కార్యక్రమానికి ప్రజలు ఎవరూ హాజరుకావద్దంటూ ఢిల్లీ పోలీసులు పిలుపు ఇవ్వడంపై సీజేపీ మండిపడింది. ఢిల్లీ పోలీసుల ధర్నాకు రావొద్దంటూ పిలుపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమంటూ సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ఇటీవల ట్వీట్ చేశారు.ం

## రతన్ టాటాకు వైఎస్ జగన్ నివాళి



తాడేపల్లి: దివంగత వ్యాపార దిగ్గజం రతన్ టాటాకు వైఎ?స్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నివాళులు అర్పించారు. రతన్ టాటా విలువలు, సేవలు, మానవతా దృక్పథం తరతరాలకు స్ఫూర్తిదాయకం అని ప్రశంసించారు. వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా..‘వినయం, సేవాభావం, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం రతన్ టాటా జీవితం. భారత పారిశ్రామిక రంగానికి కొత్త దిశానిర్దేశం చేసిన మహనీయుడు రతన్ టాటా. వ్యాపార విజయాలతో పాటు, సామాజిక సేవకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన గొప్ప వ్యక్తిత్వం ఆయనది. రతన్ టాటా విలువలు, సేవలు, మానవతా దృక్పథం తరతరాలకు స్ఫూర్తిదాయకం. రతన్ టాటా గారి వర్ధంతి సందర్భంగా ఆయన అమూల్యమైన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు’ అని పోస్టు చేశారు.

# జాబిల్లిపై వింత కాంతులు?



చందమామ ఒకవైపు నిత్యం వెలుగులతో నిండి ఉంటే.. ఇంకోవైపు చీకట్లోనే ఉంటుందని అంటారు. అయితే నాసా ప్రయోగించిన ఆర్టిమిస్--2 వ్యోమగాములు మాత్రం చీకటితో నిండిన వైపున కూడా అక్కడక్కడా వెలుగులు కనిపించాయని అంటున్నారు. అంతేకాకుండా... చంద్రుడి ఉపరితలంపై ఐదు సూక్ష్మస్థాయి కాంతి మెరుపులను గుర్తించినట్లు నాసా వెల్లడించింది. నాసా తాజాగా విడుదల చేసిన ‘ఆర్టెమిస్--2 ప్రిలిమినరీ లూనార్ సైన్స్ రిపోర్టు’లో ఈ వివరాలు ఉన్నాయి. సూక్ష్మస్థాయి కాంతి మెరుపులు ముందు ఒక మిస్టరీలా అనిపించినప్పటికీ, విశ్లేషణ జరిపిన తరువాత వాటిని చిన్న అంతరిక్ష శిలలు (మైక్రో మీటియరాయిడ్లు)గా నాసా గుర్తించింది. చంద్రుడిని అత్యధిక వేగంతో ఢీకొట్టడం వల్ల మెరుపులు పుట్టుకొచ్చాయని నిర్ధారించారు. భూమిలా వాతావరణం లేకపోవడంతో చిన్న చిన్న ఉల్కా శకలాలు కూడా నేరుగా చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొంటాయని వివరించారు.అయితే జాబిల్లి నుంచి సుమారు 74 వేల కి.మీ. దూరం నుంచి కూడా వ్యోమాములు వీటిని గుర్తించగలగడం విశేష మని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. చీకట్లోంచి చూస్తూండటం వల్ల వెలుతురు స్పష్టంగా కనిపించి ఉండవచ్చునని అంచనా కట్టారు.

### లో--యాంగిల్ సూర్యకాంతితో...



చంద్రుడిపై చీకటి, వెలుతురులు కలిసే ప్రాంతం ‘లూనార్ టెర్మినేటర్’ సమీపంలో తాము అక్కడక్కడ వెలుగు దీవులను గమనించామని వ్యోమగామి విక్టర్ గ్లోవర్ చెప్పారు. ఒరియన్ వ్యోమనౌక లూనార్ టెర్మినేటర్ ప్రాంతంలోని హెరట్జ్‌స్ప్రుంగ్ బేసిన్, వావిలోవ్ బిలం పరిసరాల్లో పర్వతాలు, బిలాలు, లోయలు మరింత పెద్దవిగా కనిపించాయని ఉపరితలం కూడా కఠినంగా ఉన్నట్లు అనిపించిందని గ్లోవర్ వివరించారు. లో--యాంగిల్‌లో పడుతున్న వెలుతురు ఇందుకు కారణమని నాసా తేల్చింది. చుట్టుపక్కల ప్రాంతాలు చీకటిలో ఉంటే ఎత్తైన ప్రాంతాల్లో మాత్రం అక్కడకక్కడా సూర్యకాంతి కనిపించిందని వ్యోమగాములు చెప్పారు. మిషన్ కమాండర్ రీడ్ వైజ్‌మన్ మాట్లాడుతూ.. టెర్మినేటర్ ప్రాంతం నుంచి చూసినప్పుడు చంద్రుడి చీకటివైపు “ఊహించలేనంత కఠినమైన భూభాగం మాదిరిగా” కనిపించిందన్నారు. ఆకాశంలో సూర్యుడు ఎక్కువ ఎత్తులో ఉన్నప్పుడు కనిపించని కొండలు, లోయలను అక్కడి నీడలు స్పష్టంగా చూపించాయని వివరించారు. 2026 ఏప్రిల్ 1న నింగికి ఎగసిన ఆర్టెమిస్--2 ఏప్రిల్ 6న చంద్రుడి సమీపాన్ని చేరుకుంది. చందమామను చుట్టేస్తూండగా వ్యోమగాములు పరిశీలనలు నిర్వహించి ఏప్రిల్ 10న తిరిగి వచ్చారు. ఈ మొత్తం ప్రాజెక్టులో వ్యోమగాములు సుమారు 800 గిగాబైట్ల సమాచారాన్ని సేకరించగా నాసా దాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఇందులో 11 వేలకుపైగా అధిక రెజల్యూషన్ ఫొటోలు, ఎనిమిదిన్నర గంటల ఆడియో, వ్యోమగాములు చేత్తో రాసిన కొన్ని అంశాలు, బొమ్మలు, వ్యాఖ్యానాలు ఉన్నాయి. 1972లో అపోలో--11 ద్వారా మనిషి తొలిసారి జాబిల్లిపైకి అడుగు పెడితే దగ్గరగా వెళ్లింది ఇదే మొదటిసారి. అందుకే నాసా ఈ సమాచారం మొత్తాన్ని యాభై ఏళ్ల కంటే ఎక్కువ సమయం తరువాత మనుషులు ఒక ఉపగ్రహానికి సంబంధించి సేకరించిన సైన్స్ డేటాసెట్ అని అంటోంది.

# ప్రతి శ్వాసకూ మెదడులో ప్రత్యేక ముద్ర!

**శ్వాస తీరుకు, మెదడు తరంగాలకు మధ్య బలమైన అనుసంధానం**

**జ్ఞాపకశక్తి, భావోద్వేగాలపై ఉచ్ఛ్వసన--నిశ్వాసాల ప్రత్యక్ష ప్రభావం**

**ప్రాణాయామం లేదా శ్వాస నియంత్రణకు రుజువులు వెతికిన పరిశోధకులు**

**యూసీ శాన్ డియాగో పరిశోధనలో ఆసక్తికర విషయాలు వెల్లడి**



మనం శ్వాస ద్వారా పీల్చుకునే గాలి ప్రాణాన్ని నిలబెట్టటమే కాకుండా, మెదడు పనితీరును అనుక్షణం నియంత్రిస్తుందని సరికొత్త శాస్త్రీయ పరిశోధనలో వెల్లడైంది. తీసుకునే ప్రతి శ్వాసకూ మెదడులోని విద్యుత్ తరంగాల రూపకల్పనతో విడదీయరాని అనుబంధం ఉంటుందని, ప్రతి శ్వాస మెదడుపై ఒక ప్రత్యేక ముద్రను (న్యూరల్ సిగ్నేచర్) వేస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోరి?నయా శాన్ డియాగో పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయనం వివరాలు ప్రతిష్టాత్మక ‘జర్నల్ ఆఫ్ న్యూరోసైన్స్’లో ప్రచురితమయ్యాయి.

శ్వాస తరంగాల రూపమే కీలకం

సాధారణంగా వైద్య రంగంలో ఒక వ్యక్తి నిమిషానికి ఎన్నిసార్లు శ్వాస తీసుకుంటున్నారనే లెక్కను మాత్రమే పరిశీలిస్తుంటారు. అయితే, ఈ విధానం వల్ల ఎంతో కీలకమైన సమాచారం వెలుగులోకి రాకుండా పోతోందని పరిశోధకులు స్పష్టం చేశారు. మనం శ్వాస పీల్చుకునే లోతు, విడిచిపెట్టే వేగం, శ్వాసల మధ్య ఉండే కొన్ని మిల్లీసెకన్ల విరామం.. ఇలా ప్రతి మార్పూ ఒక ప్రత్యేక తరంగంలా ఏర్పడుతుంది. శ్వాస తరంగాల్లోని ఈ సూక్ష్మ తేడాలు మెదడు కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా ప్రతిబింబిస్తాయని పరిశోధకులు కనుగొన్నారు.

పరిశోధన సాగిందిలా..

ఔషధాలకు లొంగని మూర్ఛ వ్యాధి (ఎపిలెప్సీ) చికిత్స కోసం నిరంతర పర్యవేక్షణలో ఉన్న 16 మంది రోగులపై ఈ అధ్యయనం నిర్వహించారు. వారి మెదడు భాగాల్లో అమర్చిన అధునాతన ఎలక్ట్రోడ్ల ద్వారా న్యూరల్ యాక్టివిటీ వివరాలను సేకరించారు. అదే సమయంలో వారు ముక్కు ద్వారా పీల్చుకునే గాలి ప్రవాహం, ఛాతీ, పొట్ట కదలికలను సెన్సర్ల సాయంతో రికార్డు చేశారు. ఈ డేటాను సరిపోల్చగా, శ్వాస రూపం మారిన ప్రతిసారీ మెదడులోని సంకేతాలు కూడా దానికి తగినట్లుగా రూపాంతరం చెందుతున్నట్లు స్పష్టమైంది.

జ్ఞాపకశక్తి, భావోద్వేగాలతో ప్రత్యక్ష లింకు

మెదడులో ఆలోచన, ప్రవర్తన, భావోద్వేగాలు, జ్ఞాపకశక్తిని నియంత్రించే కేంద్రాలపై ఈ శ్వాస తీరు నేరుగా ప్రభావం చూపుతోందని పరిశోధకుల బృందం నాయకురాలు డా. ఈనా కోసిక్--రోస్ తెలిపారు. శ్వాస తీసుకునే సమయంలో మెదడు సమాచారాన్ని గ్రహించే విధానం, శ్వాస వదిలే సమయంలో స్పందించే తీరు భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి, ఆందోళనలను నియంత్రించటానికి ప్రాణాయామం లేదా శ్వాస నియంత్రణ పద్ధతులు ఎందుకు అద్భుతంగా పనిచేస్తాయనే దానికి ఈ ఫలితాలు శాస్త్రీయ ఆధారాన్ని చూపుతున్నాయి.

ఆకస్మిక మరణాలకు అడ్డుకట్ట

ఈ పరిశోధన ఫలితాలు ప్రాణాంతక సమస్యలను ముందస్తుగా గుర్తించేందుకు దోహదపడతాయని శాస్త్రవేత్త డా. బ్రాడ్లీ వాయిటెక్ పేర్కొన్నారు. మూర్ఛ వ్యాధిగ్రస్తుల్లో ఆకస్మిక మరణాలు, పసిపిల్లల్లో నిద్రలోనే శ్వాస ఆగి చనిపోయే సడెన్ ఇన్‌ఫాంట్ డెత్ సింగ్రోమ్ వంటి ప్రమాదాలను విశ్లేషించేందుకు ఇది ఉపయోగపడుతుంది. శ్వాస ఆగిపోవటానికి ముందు మెదడు సంకేతాల్లో చోటుచేసుకునే మార్పులను విశ్లేషించి ప్రాణాలను కాపాడే వైద్య పరికరాల రూపకల్పనకు ఈ ఆవిష్కరణ మార్గం సుగమం చేయనుంది.

# మాంసం మార్కెట్లో చికెనే కింగ్..!

**ప్రపంచ మాంసం ఉత్పత్తిలో కోళ్లు,పందులదే 74 శాతం వాటా**

**తక్కువ స్థలంలో, కొద్ది రోజుల్లోనే కోతకు వస్తుండటంతో వీటి పెంపకంపైనే రైతుల మొగ్గు**

**ఐరాస ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) నివేదిక వెల్లడి**



ప్రపంచవ్యాప్తంగా ఒకప్పుడు పచ్చిక బయళ్లలో మేసే పెద్ద పశువులపై ఆధారపడిన మాంసం ఉత్పత్తి రంగం, ఇప్పుడు వేగంగా చికెన్, పందులు వంటి (ఒకే జీర్ణాశయం కలిగిన మోనోగ్యాస్ట్రిక్) చిన్న జీవుల వైపు మళ్లింది. ప్రపంచ వార్షిక మాంసం ఉత్పత్తిలో ఏకంగా 74 శాతం వాటా కోళ్లు, పందులు, టర్కీ కోళ్లు, బాతుల నుంచే లభిస్తోందని ఐక్యరాజ్యసమితి ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) తాజా నివేదికలో వెల్లడించింది. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేక లు వంటి నెమరువేసే జంతువుల వాటా కేవలం 26 శాతానికే పరిమితమైందని స్పష్టం చేసింది. పశుపోషణ రంగం ప్రపంచ వ్యవసాయ స్థూల ఉత్పత్తిలో 40% వాటాను కలిగి ఉంది. ఇది సుమారుగా 1.8లక్షల కోట్ల డాలర్లకు సమానం.

### ఎందుకీ అనూహ్య మార్పు?

ప్రపంచవ్యాప్తంగా భూమి లభ్యత తగ్గటం, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల కొరత, వేగంగా మారుతున్న ఆర్థిక సమీకరణాలు ఈ మార్పునకు ప్రధాన కారణాలని ఎఫ్ఏఓ విశ్లేషించింది. పెద్ద జంతువులను మాంసం కోసం పెంచాలంటే విస్తారమైన పచి?చక బయళ్లు, స్థలం అవసరం. కానీ పౌల్ట్రీ రంగం విస్తరణకు చాలా తక్కువ భూమి సరిపోతుంది. అడవుల విస్తీర్ణం తగ్గకుండా చూడాల్సిన అవసరం రీత్యా ఈ మార్పు అత్యంత కీలకమైన అంశంగా మారింది. కోళ్లు తక్కువ దాణాను తిని, అత్యంత వేగంగా బరువు పెరుగుతాయి. దీనివల్ల ఉత్పత్తి వ్యయం తగ్గటమే కాకుండా తక్కువ సమయంలో దిగుబడి చేతికొస్తుంది. గ్రామాల్లో వ్యవసాయ కారి?మకుల లభ్యత ప్రపంచవ్యాప్తంగా తగ్గుతోంది. దీంతో, తక్కువ మందితో సులభంగా నిర్వహించగల బ్రాయిలర్ కోళ్ల పెంపకం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. మటన్‌తో పోలిస్తే చికెన్ ధరలు మధ్యతరగతి, పేద వర్గాలకు అందుబాటులో ఉండటం ప్రపంచవ్యాప్తంగా వీటి వినియోగాన్ని విపరీతంగా పెంచింది.

### పర్యావరణ అనుకూలత

మానవ కారక ఉద్గారాలలో పశుసంవర్ధక రంగం వాటా 12 శాతం ఉంది. ఇందులో అత్యధిక వాటా ఆవులు, గేదెలు నెమరు వేసేటప్పుడు వెలువడే మీథేన్ ద్వారానే వస్తోంది. దీనితో పోలి?చతే కోళ్ల పెంపకం వల్ల వెలువడే ఉద్గారాల తీవ్రత చాలా తక్కువ కావటం పర్యావరణపరంగా కలిసివచ్చే అంశం. రాబోయే దశాబ్దాల్లో పెరుగుతున్న జనాభాకు తక్కువ వనరులతో చౌకైన జంతు ప్రోటీన్‌ను అందించటంలో కోళ్లు, పందులు, టర్కీ కోళ్లు, బాతులే కీలకంగా మారనున్నాయని ఎఫ్ఏఓ తేల్చిచెప్పింది.

### 67% వెజ్ ప్రొటీనే!

ప్రపంచ ప్రజలకు ఆహార ధాన్యాలు, పప్పుదినుసులు, సోయాబీన్స్, నూనెగింజలు, కూరగాయల ద్వారా 67% వెజ్ ప్రొటీన్ అందుతోంది. పాలు, మాంసం, గుడ్ల రూపంలో 33% జంతు ప్రొటీన్ సరఫరా అవుతోంది. ఈ జంతు ప్రొటీన్‌లో కోళ్లు/పక్షుల మాంసం, గుడ్ల ద్వారా 30%, పంటలతో పాటు ఆవులు, గేదెలు, మేకల రైతువారీ పెంపకం ద్వారా మరో 30%, పందుల పెంపకం ద్వారా 19%, బహిరంగ పచి?చక మైదానాల్లో మేత మేసే పశువుల ద్వారా మరో 12%, ఇతరత్రా 9% ప్రొటీన్ ఆహారం ఉత్పత్తి అవుతోంది.

## బంటుమిల్లి పి హెచ్ సీలో బిజెపి 'సేవా సంకల్ప అభియాన్' గర్భిణీ స్త్రీలకు పండ్ల పంపిణీ



బంటుమిల్లి శ్రీ వార్త న్యూస్:పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బిజెపి నాయకులు శుక్రవారం సందర్శించి సేవా కార్యక్రమం నిర్వహించారు.'సేవా సంకల్ప



అభియాన్' సెప్టెంబర్ 17 - అక్టోబర్ 17 కార్యక్రమంలో భాగంగా పీ హెచ్ సిలో ఉన్న గర్భిణీ స్త్రీలకు బిజెపి నాయకులు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,పెడన నియోజకవర్గ ఇంచార్జ్ పంతం వెంకట గజేంద్ర రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్య సేవలతో పాటు పోషకాహారం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆరోగ్యవంతమైన భారత్ ను నిర్మించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బంటుమిల్లి బిజెపి మండల అధ్యక్షుడు కొత్త కిరణ్ గుప్తాతో పాటు స్థానిక మండల కమిటీ సభ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేమవరం కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో అన్నప్రసాద వితరణ



గుడ్లవల్లేరు శ్రీ వార్త న్యూస్:కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి దాతలు విశేషంగా సహకరిస్తున్నారు.శ్రీమాత్రే నమః పేరిట బుధవారం జరిగిన అన్నప్రసాద వితరణకు గుడ్లవల్లేరు మండలం పెసరమిల్లి వాస్తవ్యులు కమ్మిలి వెంకట మోహన రావు దంపతులు సహకరించారు.ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ శ్రీ ఈడే మోహన్, కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు దాతలను శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదములు అందజేశారు.కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు మన్నెం వీర నాగేంద్ర రావు, కల్లేపల్లి సుగుణ సోమశేఖర్, వడ్లమూడి రవీంద్రబాబు, పెన్నేరు శేఖర్, నూతలపాటి లక్ష్మీ పావని, ముంగం ఆంజనేయులు, ఉస్తెల కోటేశ్వరమ్మ మరియు ఎక్స్ అఫీషియో మెంబర్ ఆర్ ఎస్ సి ఎస్ సంతోష్ శర్మ (శివయ్య) పాల్గొన్నారని ఈవో ఆకుల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## బోగస్ మరణ ధృవీకరణ పత్రం మంజూరు చేసిన అధికారులపై తీసుకున్న చర్యలేంటి?

### నివేదిక ఇవ్వాలన్న ఉపలోకాయుక్త



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్:బోగస్ మరణ ధృవీకరణ పత్రం మంజూరు చేసిన అధికారులపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలపై నివేదిక సమర్పించాలని వుయ్యూరు ఆర్.డి.ఓ.ను రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని ఆదేశించారు. గౌ॥ ఉపలోకాయుక్త కేసు నెం.1955/2026/లోక్/బి2 గా కేసు నమోదైంది.సామాజిక కార్యకర్తలు, ఆర్.టి.ఐ. యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్.టి.ఐ. క్యాంపెయిన్ ప్రతినిధులు జంపాన శ్రీనివాస గౌడ్, బేతపూడి జోగేశ్వరరావులు తెలిపిన వివరాల ప్రకారం.కర్ణాటక రాష్ట్రం, బళ్లారి జిల్లా, హోస్పేట మున్సిపాలిటీలో ది.14.01.1993న పామర్రు లక్ష్మీపతి మరణించగా, పమిడిముక్కల మండలం, వీరంకి గ్రామంలో ది.22.03.1994లో మరణించినట్లు బోగస్ మరణ ధృవీకరణ పత్రాన్ని పమిడిముక్కల మండల తహశీల్దార్ జె.మహేశ్వరరావు మంజూరు చేశారని ఆరోపణ.ఈ బోగస్ పత్రం మంజూరులో అప్పటి పంచాయతీ కార్యదర్శి వి.ప్రభుకుమార్ కీలక పాత్ర వహించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి పామర్రు లక్ష్మీపతి మరణ ధృవీకరణ పత్రం కర్ణాటకలోని హోస్పేట మున్సిపాలిటీలో 14.01.1993న నమోదు కాబడింది.దీనిపై రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిని, రాష్ట్ర రెవెన్యూ శాఖామాత్యులను ది.15.12.2025న కలిసి ఫిర్యాదు చేసినా తగిన చర్యలు తీసుకోనందున ఉపలోకాయుక్తకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారు తెలిపారు.దీనిపై స్పందించిన రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని, బాధ్యులైన అధికారులపై తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని వుయ్యూరు రెవెన్యూ డివిజన్ అధికారిని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## కొమ్మారెడ్డి స్కూల్ లో ఘనంగా దసరా సంబరాలు



బంటుమిల్లి శ్రీవార్త న్యూస్; కొమ్మారెడ్డి పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం చక్కని సాంప్రదాయ భక్తి గీతంతో ప్రారంభమైనది. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు వి. సాంబ శివరాజు అమ్మవారు ఏ రోజున ఏ అవతరము ఆ



అవతారా విశిష్టతను చక్కగా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారి వివిధ రూపాలను భక్తి గేయాలలో ప్రదర్శిస్తూ చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈసందర్భంగా స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకి చదువుతో పాటు మన పండగలు, సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి వేడుకలునిర్వహిస్తున్నామని, దసరా అనేది స్త్రీని గౌరవించాలని, స్త్రీ శక్తి స్వరూపమనితెలియజేస్తుందని, చెడు పై మంచి సాధించిన విజయమే దసరా అని వివరించారు. అనంతరం దసరా విశిష్టత అనే వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకి డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ , సెక్రటరి అండ్ కరస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ , కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య , పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. శ్రీనివాస రావు ఉపాధ్యాయులు, పలువురు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గిలకల డిండి ఫిషింగ్ హార్బర్ పనులపై మంత్రి కొల్లు రవీంద్ర ఆకస్మిక తనిఖీ

### పనుల నత్తనడకపై తీవ్ర అసంతృప్తి -- కాంట్రాక్టర్ పనితీరుపై మంత్రి ఆగ్రహం

### పనులు వేగవంతం చేయకపోతే కాంట్రాక్టు రద్దుపై నిర్ణయం తీసుకోవాలని అధికారులకు ఆదేశం




మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:గిలకల డిండి ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల పురోగతిపై రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రదేశానికి చేరుకున్న మంత్రి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు పూర్తిచేయడానికి గడువులను ఇప్పటికే రెండుసార్లు పొడిగించినప్పటికీ, పనుల్లో గణనీయమైన పురోగతి కనిపించకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పనుల చరిత్రపై ఆరా





గతంలో 2014-19 కాలంలో సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో గిలకలదిండి ఫిషింగ్ హార్బర్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం తదుపరి ప్రభుత్వం పనుల అంచనా వ్యయం గణనీయంగా పెంచడం, నిర్మాణ బాధ్యతలను సంబంధిత సంస్థలకు అప్పగించడం,కాంట్రాక్టర్ మార్పులు చోటుచేసుకోవడం వంటి పరిణామాలపై ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ ద్వారా మరో సంస్థకు పనులు అప్పగించబడినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆశించిన వేగంతో పనులు జరగకపోవడం పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. మత్స్యకారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ప్రతిష్టాత్మక ఫిషింగ్ హార్బర్ నిర్మాణం సకాలంలో పూర్తికాకపోవడం వల్ల ప్రజలకు, ముఖ్యంగా మత్స్యకారులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

### కాంట్రాక్టు రద్దు ఎందుకు చేయకూడదు?

పనులు సకాలంలో పూర్తిచేయడంలో విఫలమైన కాంట్రాక్టర్‌పై ఇప్పటివరకు ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేదని మంత్రి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. పనుల గడువు పొడిగించినప్పటికీ పురోగతి లేకపోవడానికి కారణాలను స్పష్టంగా తెలియజేయాలని కాంట్రాక్టర్ ప్రతినిధులను ఆదేశించారు.పనుల్లో ఇదే విధమైన నిర్లక్ష్యం కొనసాగితే సదరు కాంట్రాక్టర్ కాంట్రాక్టును ఎందుకు రద్దు చేయకూడదో పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

### ఉన్నతాధికారులతో ఫోన్లో సమీక్ష

ఫిషింగ్ హార్బర్ వద్ద నుంచే మంత్రి సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి పనుల పురోగతి, ఇప్పటివరకు జరిగిన వ్యయం, మిగిలిన పనులు, కాంట్రాక్టర్ పనితీరు, గడువుల పొడిగింపు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల విషయంలో అధికారులు, కాంట్రాక్టర్ సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఫిషింగ్ హార్బర్ పనుల ప్రస్తుత పరిస్థితిపై శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉన్నతాధికారులందరూ గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ పైన సమగ్రంగా సమీక్ష నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులు, పూర్తిచేయాల్సిన పనుల వివరాలు, అవసరమైన వనరులు, కాంట్రాక్టర్ పనితీరు తదితర అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమీక్షలో పనులను వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు, కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు లేదా కాంట్రాక్టు రద్దు వంటి అంశాలపై నిబంధనల మేరకు నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

### పనులు పూర్తయ్యే వరకు పర్యవేక్షణ కొనసాగిస్తా

గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తయ్యే వరకు తాను నిరంతరం పర్యవేక్షిస్తానని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పగటిపూట తన శాఖకు సంబంధించిన విధులు నిర్వహించిన అనంతరం రాత్రి వేళల్లో కూడా ఫిషింగ్ హార్బర్ వద్దకు వచ్చి పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తానని అధికారులకు తెలిపారు.ప్రజల సొమ్ముతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని ఎంతమాత్రం సహించబోమని, మత్స్యకారుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఫిషింగ్ హార్బర్ పనులను నిర్ణీత ప్రమాణాలతో,వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఫోన్లో మాట్లాడుతూ, ఫిషింగ్ హార్బర్ పనుల పురోగతిపై శుక్రవారం ఉదయం ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించి, పనుల ప్రస్తుత స్థితిగతులను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని మంత్రికి వివరించారు.కాంట్రాక్టర్ పనితీరు, పనుల పురోగతి, గడువులు, నిబంధనల ఉల్లంఘనలు తదితర అంశాలను పరిశీలించి, ప్రభుత్వ ప్రయోజనాలు మరియు మత్స్యకారుల ప్రయోజనాలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను, కాంట్రాక్టర్ ప్రతినిధులను పనుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని మరోసారి హెచ్చరించి, అక్కడి నుంచి బయలుదేరారు.ఈ ఆకస్మిక తనిఖీలో మచిలీపట్నం డీఎస్పీ, మారిటైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సేవ మాధవ సేవతో సమానం.



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:మచిలీపట్నం ఈడేపల్లి జెట్టి కృష్ణమూర్తి ప్రభుత్వ వృద్ధుల శరణాలయంలో విశ్రాంత ఇండియన్ బ్యాంక్ మేనేజర్ వెచ్చా సత్యనారాయణమూర్తి 75వ జన్మదినోత్సవం సేవా కార్యక్రమం తో నిర్వహించారు.వృద్ధాశ్రమంలో ఉన్న అందరికీ సత్యనారాయణమూర్తి తన జన్మదినోత్సవం సందర్భంగా టవల్స్ వంటి సబ్బులు, బట్టల సబ్బులు ఫ్రూట్స్ స్వీటు హాటు పంపిణీ చేశారు.కేకు కట్ చేసి అందరితో తన ఆనందాన్ని పంచుకున్నారు. వెచ్చ సత్యనారాయణమూర్తి 75 సంవత్సరాల వయసులో కూడా మచిలీపట్నంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మచిలీపట్నంలోని




అనేక పాఠశాలలో ఉచితంగా ఫిజికల్ సైన్స్ బోధిస్తూ సమాజానికి తన వంతు చేయుత అందిస్తున్నారని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు.వెచ్చ సత్యనారాయణమూర్తి సేవా కార్యక్రమం పదిమందికి ఆదర్శప్రాయమని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాల్లో వెచ్చ భాగస్వాములు అవుతున్నారని మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రతినిధి ముదిగొండ శాస్త్రి అన్నారు.వయావృద్ధులు తల్లితండ్రులతో సమానం అని వారికి అందించే ప్రతి సేవా కార్యక్రమం భగవంతుడి సేవతో సమానమని వెచ్చా సత్యనారాయణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమానిటీ ఫౌండేషన్ నిర్వాహకురాలు నూర్జహాన్ బేగం మరో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మూర్తి,వృద్ధాశ్రమం సిబ్బంది పాల్గొన్నారు. 75 సంవత్సరాల వయసులో తమ వద్దకు వచ్చి తమతో జన్మదినోత్సవ కార్యక్రమం జరిపినందుకు వయోవృద్ధులు వెచ్చ సత్యనారాయణ మూర్తి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మల్లంపల్లి- కోసూరు జడ్పీ రహదారిని మరమ్మత్తులు చేయండి..

-రెండు దశాబ్దాలుగా రహదారిని నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు - మాజీ సర్పంచ్ బి.అమలేశ్వరరావు



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని మల్లంపల్లి - కోసూరు జిల్లా పరిషత్ రహదారిలో ఏర్పడిన రహదారికి సగం పైగా కోతకు గురైన గుంతకు తూములు వేసి రహదారిని సరిచేసి ప్రమాదాలను నివారించాలని మల్లంపల్లి మాజీ సర్పంచ్ బి అమలేశ్వరరావు శుక్రవారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా రహదారి నిర్మించడం జరిగిందని, ఈ రహదారి వెంట ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ధాన్యం లోళ్లు వెళ్లడంతో ఈ రహదారి మరింత నిర్లక్ష్యాన్ని గురైందని ఆవేదన చెందారు. గత నెలలో కురిసిన వర్షానికి గుంత మరింత పెద్దదిగా మారి మరింత ప్రమాదకరంగా మారిందని ఆవేదన చెందారు. ద్విచక్ర వాహన దారులు ప్రమాదానికి గురై గాయాలతో బయటపడ్డ పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు కళ్ళు తెరిచి ఈ రహదారికి తూములు వేసి రోడ్డును సరిచేయాలని, రహదారిని కూడా వెంటనే నిర్మించి ప్రమాదాలను అరికట్టాలని మాజీ సర్పంచ్ అమలేశ్వరరావు తెలిపారు.

## శ్రీ జలధీశ్వరుని హుండీ ఆదాయం రూ.3,46,723



ఘంటసాల, శ్రీవార్త న్యూస్: మండల కేంద్రమైన ఘంటసాల లో వేంచేసి వున్న శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి వారి దేవస్థానం హుండీ శుక్రవారం లెక్కించారు ఆలయ కార్యనిర్వహణాధికారి తోట చెన్నకేశవ మాట్లాడుతూ 14 నెలలకు గానూ లెక్కించగా రూ.3,46,723 లక్షలు వచ్చిందన్నారు. నడకుదురు శ్రీ పృద్వీశ్వర స్వామి దేవస్థానం ఈవో బీవీ.కోటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, అర్చకులు దాలిపర్తి చలపతిరావు, చావలి కృష్ణ కిషోర్, చావలి దుర్గా దీక్షితులు, ఘంటసాల ఐటిఐ కాలేజ్ విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001